# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 34 సంచిక 4
పేజీలు 40
డిసెంబర్ 2014

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ....................................2
శ్రీబాబూజీ ఉవాచ...............................3
అమ్మమాట...........................................5
సన్నిధిలో సంభాషణ ...........................6
యోగవాశిష్ఠము ...............................8
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.....................10
నారదుడి శాపం.................................11
పరిప్రశ్నేన సేవయా............................13
సద్గురు శ్రీయాత్రా దర్శన్......................14
ఏమని ప్రార్థింపనూ మా గురుదేవుని ............... 16
శతాక్షీ-శాకంబరీ-దుర్గ........................17
శ్రీకృష్ణకర్ణామృతము............................19
రాధ భక్తి .......................................21
భక్త మార్కండేయ ..............................23
శ్రీసద్గురు సన్నిధిలో మధుర క్షణాలు..........25
ఆత్మబలం.........................................27
శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడు ........................29
కులమతాలకు పరమాత్మ అతీతుడు..........31
సత్సంగామృతం..................................33
హనుమద్వైభవము..............................35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్................39

## భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అద్వైతం భావయేన్నిత్యం సర్వావస్థాసు సర్వదా ।
కదాచిదపి నోకుర్యా దద్వైతం గురుసన్నిధౌ ॥
(గురుగీత - 134 శ్లో॥)

'అద్వైతం త్రిషులోకేషు నాద్వైతం గురుసన్నిధౌ, భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం న కుత్రచిత్' అని శాస్త్రములో ప్రస్తావించినట్లే శ్రీ పరమేశ్వరుడు పార్వతీదేవికి సద్గురుమూర్తి సన్నిధిలో శిష్యుడు ప్రవర్తించవలసిన విధి విధానమును తెలియజేస్తూ శ్రీగురుదేవుడు ఉపదేశించిన మహావాక్యార్థ తత్త్వమగు పరబ్రహ్మము తానను అద్వైత భావన అనుభవించిన వాడైనా గురుసన్నిధిలో ఏ అవస్థలోనైనా అద్వైతము పాటించరాదు.

'అహం బ్రహ్మాఽస్మి అనుభూతి దృశ్యరహిత వృత్తి. ఇట్టి అనుభూతి భావన మాత్రం చేత దృశ్యము, బాహ్యాంతరాలలో విస్మరణ కలగాలి. అట్టి దృఢత్వం లోపిస్తే సంకల్పములు వచ్చిపడి అనాత్మవృత్తి సంప్రాప్తింపజేస్తుంది సుమా!

యదార్థమే అయినా అఖండ స్వస్వరూప జ్ఞానము ఏ దేవుని అనుగ్రహము ద్వారా సంప్రాప్తించినదో అట్టి శ్రీగురు పరంధామునిపై పరమ భక్తి భావముతో, వినయవిధేయతలతో ప్రవర్తించినప్పుడే పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది. అంతేకాక గురుభక్తి వర్జితుడైన శిష్యుడు అవసానకాలంలో మనస్సు విక్షేపం చెంది మోహము కల్గించు దృశ్య ప్రతీతి చేత అద్వైత తత్త్వజ్ఞానమునకు భంగం కల్గి జన్మకి రాక తప్పదు సుమా! అని శాస్త్రాలు హెచ్చరిస్తున్నాయి.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహారాజ్ భక్తులకు బోధచేస్తూ "మన పండితులు భక్తి గొప్పదా? జ్ఞానం గొప్పదా అనే ప్రశ్న లేవనెత్తారు కదా! భక్తి యొక్క పరాకాష్ఠయే జ్ఞానం. అంతేకాదు భక్తిలేని జ్ఞానం ప్రకాశించదు. అది శుష్క వేదాంతము అవుతుంది. శిరస్సులేని మొండెమును ఎవరు గుర్తించ గలుగుతారయ్యా? పోనీ దానికి ఏమన్నా విలువ ఉంటుందా? శాస్త్రవాసన ఉన్న పండితులు ఇటువంటి సందేహాలు, సంశయాలతో తమ కాలాన్నంతా వ్యర్థం చేసుకుంటారు. అందువల్లనే శ్రీ కృష్ణ పరమాత్ముడు ఇటువంటి సందేహాలకి తావియ్యకుండా అర్జునునికి కలిగిన సందేహాన్ని తీర్చగలిగాడు. సగుణ భక్తి గొప్పదా? నిర్గుణ భక్తి గొప్పదా? అన్ని ప్రశ్నించిన అర్జునునికి "భక్తుడు ఏ విధంగా ఆరాధించినా అన్నింటికీ ప్రధానమైనది మనస్సు నిశ్చలత్వాన్ని పొందినపుడే అది భక్తి అనిపించుకొంటుంది" అని సెలవిచ్చారు. అంతేకాదు శ్రీకృష్ణ పరమాత్ముడు తన 'మనస్సులో ఏ కోర్కెలేకుండా వృత్తిరహితమై తానెవరో తాను తెలుసుకొనగలిగిన జ్ఞానము కలవాడే స్థిత ప్రజ్ఞుడు అని సెలవిచ్చారు' కాబట్టి భక్తియొక్క పరాకాష్టయే జ్ఞానము అని పిలువబడుతుంది" అన్నారు.



శ్రీ బాబూజీ మహారాజ్ ఇంకా మాట్లాడుతూ "ఇక్కడ మీ కొక ఉదంతం చెపుతాను. వశిష్ఠులవారు, విశ్వామిత్రుడు ఇద్దరూ మహర్షులే. వారికి సందేహాలు కలుగవు కదా! కాని వారిని ఆశ్రయించిన భక్తుల సౌకర్యార్థం వారు కొన్ని సంఘటనలను చిత్రించి భక్తులకుకలిగే సందేహాలను, నివృత్తి చేస్తారు. అదే మహాత్ములు అందజేసే దివ్య సందేశము.

వశిష్ఠ మహర్షికి, విశ్వామిత్రునకు అభిప్రాయ బేధం కలిగింది. వశిష్ఠుల వారు సత్సంగము ఆచరించదగినదని, దానికి భిన్నంగా

విశ్వామిత్రుల వారు ధ్యానము లేక తపస్సు గొప్పదని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని ఇరువురు మహర్షులు పరిష్కరించుకోలేక త్రిమూర్తుల దర్శనార్థమై బయలు దేరారు. ముందుగా బ్రహ్మదేవుని దర్శించడానికి వెళ్ళారు. ఆయన సృష్టికర్తగాబట్టి తన చుట్టూ దేవతలతోటి చర్చలో నిమగ్నమై వున్నాడు. బ్రహ్మదేవుడు సత్యగోష్ఠిలో నిమగ్నమై ఉన్నాడు కాబట్టి ఆయన తీర్పు న్యాయబద్ధంగా వుండదని నిర్ణయించుకొని ఇద్దరు మహర్షులు కైలాసనాధుడైన మహేశ్వరుని దర్శనార్థమై బయలుదేరారు. కైలాసనాధుడు ధ్యానములో నిమగ్నమై వున్నాడు. ధ్యానములో వున్న మహేశ్వరుడు ధ్యానమే గొప్పదని చెపుతాడు కదా అని సందేహించి, వైకుంఠ వాసుడయిన శ్రీమన్నారాయణమూర్తి దర్శనార్థం వెళ్ళారు శ్రీమన్నారాయణుడు శేషశయనుడై యోగ నిదురలో నిమగ్నమై వున్నాడు. ఇంక ఇరువురి మహర్షుల సమస్యను పరిష్కరించడానికి ఆదిశేషుడు మాత్రమే మిగిలివున్నాడు. మహర్షులు ఇద్దర్ని సాదరంగా ఆహ్వానించి వారి రాకకు కారణం ఏమిటో తెలుసుకున్నాడు. “సత్సంగము గొప్పదా? ధ్యానం గొప్పదా?” అనే విషయాన్ని గురించి మీతో చర్చించాలి అంటే శ్రీమన్నారాయణమూర్తి యోగ నిద్రకు అంతరాయం కలుగకుండా నేను మోసే ఈ భారాన్ని మీ ఇరువురిలో ఎవరైనా స్వీకరించినట్లయితే నా మనస్సు, మీకు సమాధానం చెప్పే అవకాశం కలుగుతుంది. ఎందువలన అంటే నా మనస్సు శ్రీమన్నారాయణుని యందే లగ్నమైవుంది. ఇంక ఏ విధమైన విషయము ఆలోచించే స్థితిలో లేదు” అన్నాడు. ఆ సమాధానం విన్న మహర్షులు ఇద్దరికి తమ మనస్సుకు పరిష్కారం లభించినట్లయినది.

చూశారా! మీరు సత్సంగంలో పాల్గొన్నా, లేక ధ్యానంలో నిమగ్నమయినా మీ మనస్సు దానియందు నిలబడితేనే అది ప్రకాశిస్తుంది. మీరు ఇన్ని గంటలు ఈ సభలో కూర్చొని నేను చేసిన బోధని ఆకలి, దప్పికలు మరిచి మనస్ఫూర్తిగా శ్రవణం చేస్తున్నారు కదా! ఈ సత్సంగమునకు కేటాయించిన మీ కాలము నిత్యకాలంలో జమకాదా! ఇది ధ్యానము కాక ఏమవుతుంది?” అని ప్రశ్నించారు శ్రీ బాబూజీ మహారాజ్.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

## బ్రహ్మజ్ఞానమే గురువు

ఇంత లోతయిన అధ్యాత్మిక విషయాలు మనకు అర్థమవ్వాలంటే సజ్జన సాంగత్యం అవసరమని చెబుతూ శ్రీకబీర్..................

హై అథాహ్ సాధు సంతన్ మే నదియా లహర్ సమానా।
ధీవర్ జాల్ డాల్ కా కరిహై జబ్ మీన్ పిఘల్ భయె పానీ॥

అనంతమైన, లోతు తెలియని 'సాధు సాంగత్యమనే' నదిలో, జీవుడనే చేప ఒక అలలాగ అయిపోయి, ఆ నీటిలో కరిగిపోయి తదాకార రూపం చెందిననప్పుడు, యముడనే జాలరి వచ్చి, మృత్యువనే వలను వేసినా, అతనికి ఏమి దొరుకుతుంది? జీవేశ్వరులు ఏక రూపం అయిపోతే, మృత్యువు దేనికి? అని ప్రశ్నిస్తున్నారు శ్రీ కబీర్.

ఈ విధంగా మహాత్ములందరూ సత్యవస్తువుని గుర్తించమని ప్రబోధం చేస్తున్నా ఎంతమంది వింటున్నారు? అని వాపోతూ శ్రీ కబీర్ ఇలా అంటున్నారు.....

'అనుభవ్ కా జ్ఞాన్ - ఉజల్ తకి వాణీ సోహై అకథ్ కహానీ।
కహే కబీర్ - గూంజే కీ సైన్। జిన్ జానే - ఉన్ మానీ .......॥
గురు మిలే బ్రహ్మజ్ఞానీ - హమారే గురుమిలే బ్రహ్మజ్ఞానీ।
పాయిా అమర్ నిషానీ .................. గురుమిలే బ్రహ్మజ్ఞానీ॥

"గురువులు తాము ఎన్నెన్నో సాధనలను చేసి, అనుభవానికి తెచ్చుకున్న జ్ఞానాన్ని, వారి యొక్క వాణి ద్వారా మనపై వెదజల్లుతున్నారు. అది ఒక అంతులేని కథ. ఎంత చెప్పుకున్నా తీరనిది. అంతటి జ్ఞానాన్ని మనకోసం ధారపోస్తున్నారు. అచింత్య, అవ్యక్త, నిర్గుణ తత్వాన్ని వారనుభవించి మనకి వ్యక్తం చేయడం కోసమే వారు దేహాన్ని ధరించి మన ముందుకి వస్తున్నారు. దిక్కులు పిక్కటిల్లే లాగ వారి వాణి నందిస్తున్నారు. ఎవరు ఆ గురువాణిని ఆలకించి, ఆచరిస్తారో, ఆనందం వారి సొత్తు" అన్నారు శ్రీకబీర్‌దాసు.

ఆనాడు గీతాచార్యుడు కూడా భగవద్గీతనంతా చెప్పి, "నాయనా! అర్జునా! నీకు నేను చెప్పవలసినది అంతా చెప్పాను. నీకు ఎలా ఇష్టమైతే అలా చేయి" 'యథేచ్ఛసి - తథాకురు' అన్నాడు.

## సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

20-12-85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "అహంకారము చాలాచెడ్డది. తపస్సంపన్నులైన ఋషులు కూడా అహంకారమనే మాయకు గురికావచ్చు. ఇంక సామాన్య మానవులైన కోన్‌కాస్ గొట్టాల విషయం ఏం చెప్పగలము?

భృగు మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయనని మాయ అనే అహంకారము ఆవరించింది. మహేశ్వరుడిని, బ్రహ్మని తిరస్కరించి శేషశయనుడైన విష్ణుమూర్తి వక్షస్థలము మీద ఒక్కతన్నుతన్నాడు. శేషశయనుడు చలించలేదు. ఆయన శాంతాకారుడు. ఆయన స్పర్శ చేతనే భృగునికి కర్మరహితం అయింది. విష్ణుమూర్తి వెంటనే భృగు మహర్షిని ఉద్దేశించి మాట్లాడుతూ 'మహాత్మా! తపస్సంపన్నులైన మీ ఉనికిని గుర్తించనందుకు మీ పాదముతో మా వక్షస్థలముపై తన్ని తెలియజేశారు, అతిసుకుమారమైన మీ పాదములకు మా కఠిన వక్షస్థలము నొప్పి కలిగించి ఉండవచ్చు' అని భృగుమహర్షి యొక్క పాదమును నిమురుతూ దానిలో అంతర్గతంగా ఉన్న అహంకారమనే నేత్రాన్ని నొక్కి రహితం చేశారు.



భృగుమహర్షికి అహంకారము తొలగింది. జ్ఞానోదయమైంది. తాను ఎక్కడ ఉన్నదీ, ఏ విధంగా ప్రవర్తించిందీ అవగతమైంది. నిరంతరము తాను ఎవరి కృపారసం కోసం తపస్సు ఆచరిస్తున్నాడో ఆయనను తన్నటం ఏమిటి? అని ఆ మహర్షి విష్ణుమూర్తి దివ్య చరణార విందములపై పడి శరణు వేడుకున్నాడు.

భగవానుడు నిర్హేతుక జాయమాన కరుణా కటాక్ష సంపన్నుడు. తన కుమారుడు ఏదో తెలియక తప్పుచేశాడు అని ఆ తప్పు దిద్దటమే కాక కలియుగంలో శ్రీనివాసుడై అవతరించి ఆ ఋషి పాదముల ముద్రను తన వృక్ష స్థలమునందు ధరించి భక్తులందరికి దర్శనము ఇస్తున్నాడు. జ్ఞానోదయం అయిన వెంటనే అజ్ఞానమనే చీకటిని వెళ్ళమని చెప్పనక్కరలేదు.

అంత దయాళువు అయిన పరమాత్ముడిని ప్రేమించటానికి

మానవుడు సంశయిస్తున్నాడు. ఉయ్యాలలో ఉన్న 5 మాసముల బిడ్డకి తల్లి ఎంత పనిలో ఉన్నా ఏ టైముకి ఏది కావాలో ఎలా అందజేస్తున్నదో అలాగే భగవంతుడు జగత్తు అనే ఉయ్యాలలో ఉన్న తమ బిడ్డలకు ఎప్పుడు ఏది కావాలో దానిని అందజేయలేడా? అయితే దానిని అందుకోవటానికి 5 మాసముల చంటి బిడ్డ నిరహంకారియై  ఏస్థితిలో ఉందో ఆస్థితిలో ఉ ండగలవా? నీ మనస్సు ఆ స్థితిలో ఉండగలదా? భగవంతుడు ఏడీ కనిపించడే అంటే ఎలా కనిపిస్తాడు? నీ మనస్సును ఆ పరమాత్ముని పాదకమలములందు, బుద్ధిని ముఖకమలమునందు, చిత్తమును నేత్రకమలములందు, ఆహంకారాన్ని అభయహస్త కమలమునందు నిలిపితే ఆ కనులలో ఉండే మకరంద మాధుర్యాన్ని అందుకోగలుగుతావు.

ఆ మాధుర్యాన్ని అందుకోగానే నీలో ఉండే ఈర్ష్య, ఆసూయ. రాగాద్వేషాలు హరిస్తాయి. మనస్సు, చిత్తము, బుద్ధి, ఆహంకారము సత్యము, శాంతి, దయ, ప్రేమలుగా మారతాయి. నీ మనస్సుని పరమాత్ముని అభయహస్త కమలము నందు నిలిపితే సంకటముల నుండి రక్షింపబడతావు. నేత్రకమలము ఆజ్ఞానమనే చీకటిని హరిస్తుంది. ముఖకమలము మాయను హరిస్తుంది. పాద కమలమందు మనస్సు నిలిపితే అంతఃకరణ శుద్ధి జరుగుతుంది.

కాని మానవుడు అలా ఉండడు. 'ఏమయ్యా వెంకట్రావు ఎలా ఉన్నావు? బాగున్నావా? అని పలకరించి, అతను వెళ్ళగానే Phone చేసి వెంకట్రావు వస్తున్నాడు జాగ్రత్త' అని ఉన్నవి లేనివి కల్పించి చెపుతాడు. భగవంతుడిని నమ్మినవాడు ఇటువంటి పనులు చేయడు. భగవంతుడిని నమ్మనివాడు ఇప్పటి నుంచే భగవంతుడి గురించి ఆలోచించటం ఎందుకు హాయిగా తిని అనుభవించక? అనుకుంటాడు. నీ బాల్యావస్థ అయిపోయింది. యౌవనం అయిపోతున్నది. కౌమార దశలో, యౌవనంలో లాగా ఇప్పుడు గంతులు వెయ్యగలవా? వార్ధక్యం వచ్చిన తర్వాత నీదేహాన్నే నువ్వు మొయ్యలేవు. ఇంక సాధన ఏం చేస్తావు? పోనీ ధ్యానం చేయటానికి కాళ్ళు, చేతులు నీ స్వాధీనంలో ఉంటాయా? నిన్ను దారాపుత్రాదులను వదులుకుని సన్యసించమని ఏ మహాత్ముడూ చెప్పలేదు. నెల రోజులు కర్మచేస్తే కదా నీ ఉద్యోగంలో కూడ నీకు జీతం ఇచ్చేది. మరి భగవంతుని విషయంలో అంత శ్రద్ధ ఎందుకు చూపరు? అలా చూపితే పరమాత్ముడు ప్రతిఫలాన్ని ఇవ్వడా" అన్నారు శ్రీబాబు.

## యోగవాశిష్ఠము

- సుషుమ్నా ప్రసాద

ఎవరైతే సుగుణ సంపన్నులై, పవిత్ర గ్రంథపఠనంచేసి జ్ఞానమును పొంది, ధర్మ మార్గములో నడుస్తూ సత్త్వవర్తునులై, విషయ భోగాలకై, ప్రాకులాడరో, అట్టివారు, అద్భుతములను సాధించగలరు. వారు యెట్టి కార్యాన్నైనా, యెంత కష్టతరమైనదైనా వారు సాధించగలరు. వారు సులభంగా కీర్తిని, దీర్ఘాయుష్షును, ఆత్మ సాక్షాత్కారమును పొందగలరు, ఇతరులు సాధించలేని, పొందలేని వాటిని వీరు సులభంగా పొందగలరు. అపాయములు, కష్టములు వారి నుండి పారిపోతాయి. వారు తాము చేసే కార్యాలన్నిటిలో విజయమును సాధిస్తారు.



"ఓరామా! నీవు అన్ని బాధలకు, కలతలకు, భయాలకు తిలోదకాలివ్వు; మన శాస్త్రములాదేశించిన మార్గములో పయనించు. ఆత్మజ్ఞానములేని ధనము నిష్ప్రయోజనం. భౌతిక సంపదపట్ల నిరాసక్తతో తృణప్రాయంగా భావించు. ధన సముపార్జన దుఃఖానికి దారి తీస్తుంది, కోరిక రహితమైతే, మహత్తరమైన శాంతిని, నిత్యానందమును పొందుతావు.

### భీమ, భాస, దృఢల కథ

సంసార సాగరము నుండి విముక్తి పొందాలంటే, మహాపురుషుల సాంగత్యం అంటే, సత్సాంగత్యమే శరణ్యము, యాత్రలు సద్గ్రంథ పఠనము, పూజాపునస్కారముల వలన, ముక్తి లభించదు. సాధకుడు మహర్షియైన తన గురుమూర్తి పవిత్ర పాదారవిందములకు సాష్టాంగ నమస్కారముచేసి, సద్గురు మూర్తి అనుగ్రహవిశేషము, సహకారము వల్ల మాత్రమే, జనన, మరణ చక్రము నుండి విముక్తి పొందగలడు, ఎవరైతే ఆత్మ జ్ఞాన సంపన్నుడై, సత్య మార్గములో పయనిస్తూ, పవిత్ర గ్రంథములలోని సూత్రములు, సూచనలనను సరించి, అహంకారమును, క్రోధమును జయిస్తాడో; అతనే

మహర్షియనిపించుకొంటాడు. ఎవరైతే బ్రహ్మానుభూతిని ప్రత్యక్షముగా యనుభవించరో, వారు చిదాకాశమును గుర్తించరు. ఎవరైతే బ్రహ్మ సాక్షాత్కారము లేక ఆత్మ సాక్షాత్కారమును పొందుతారో, వారే చిదాకాశ స్వరూపులు, జ్ఞానమనే ఆకాశమును 'అహం' అనే మేఘము ఆవరించినప్పడు బ్రహ్మ (అసలైన నేను) అనే, కమలమెప్పడూ వికసించదు, అహంకారమనే మొక్క పునర్జన్మయనే మానుతో నాది, నీది యనే కొమ్మలతో బాగా విస్తరించి, కష్టాలు, దుఃఖము, బాధలనే ఫలాలనిస్తుంది. అహంకారమున్నంత కాలము, కోరికలకంతముండదు, ఎవరైతే తన హృదయములో అహంకారమనే బీజమును వేరుతో సహా నిర్మూలిస్తారో వారికి మాయా వృక్షము లేక సంసార వృక్షము, అనేకమైన కొమ్మలతో, రెమ్మలతో వృద్ధి చెందకుండా నిగ్రహిస్తుంది.

అప్పడు శ్రీరామచంద్రుడు వశిష్ఠ మహర్షితో యిలా అన్నాడు, 'ఆచార్య దేవా! అహంకారము యొక్క స్వభావమేమిటి? బలీయమైన అహంకారమునెలా నిర్మూలము చేయగలము? అహంకార నిర్మూలమైతే వచ్చే లాభాలేమిటి? మానవుడు శారీరక వాసల కెలా అనుబంధమైవున్నాడు? ఈ అహంకారము దేహమునకు సంబంధించిందా, మనసుకు సంబంధించిందా లేక రెండింటికి సంబంధించిందా? శరీరాన్ని విసర్జించటము వలన అహంకార ఫలితము నుండి, విముక్తి పొందగలమా?'

వశిష్ఠ మహర్షి యీ విధంగా సమాధానమిచ్చాడు 'ఎవరైతే, అన్ని సమయాలలో మానసిక ప్రశాంతతను భద్రపరచుకొని, కోరికలకు, అయిష్టాలకతీతంగా వుంటాడో, అట్టి వ్యక్తి అహంకారమునకు దాసోహమనడు, మూడు ప్రపంచాలలో, మూడు రకాలైన, అహంకారమున్నది. అందులో మొదటి రెండు రకాల, అహంకారము మేలుచేసేది, ఉదాత్తమైనది కాని మూడవ రకమైన అహంకారము చాలా చెడ్డది, అందు చేత విసర్జింప బడవలసినది.

- సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమములు

<u>డిసెంబర్ 2014</u>

2 మంగళ : గీతాజయంతి - గీతాపారాయణ.

3 బుధ : శ్రీసద్గురుదేవులు స్వస్వరూపలయం పొందిన తేది - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

6 శని : పూర్ణిమ; దత్తాత్రేయ జయంతి - శ్రీసద్గురుపాదపూజ.

7 ఆది : శ్రీసద్గురుదేవులు మహాసమాధిలో ప్రవేశించిన తేది - శ్రీసద్గురు పాదపూజ

16 మంగళ : శ్రీగురుదశమి- శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము. ధనుర్మాసకార్యక్రమాలు ప్రారంభం.

ఉదయం 9-30ని॥లకు సంకీర్తన, 10గం.లకు తిరుప్పావై, 10-30ని॥ ఋషుల చరిత్ర, 11గం.లకు భాగవత ప్రవచనము, సత్సంగము, తీర్థ ప్రసాద వితరణ.

20 శని : మాసశివరాత్రి., శని త్రయోదశి.

25 గురు : క్రిస్మస్ - శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము.

జనవరి 2015

1 గురు : ఆంగ్లసంవత్సరాది. వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) ఉత్తరద్వార దర్శనము, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

5 సోమ : పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

10 శని : శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన

14 బుధ : భోగి పండుగ - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళుపోయుటం.

15 గురు : సంక్రాంతి; శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన,

16 శుక్ర : కనుమ పండుగ.

19 సోమ : మాస శివరాత్రి

26 సోమ : రథసప్తమి; రిపబ్లిక్ డే

30 శుక్ర : భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

## నారదుడి శాపం

- పాటీలు తిమ్మారెడ్డి

ఒకసారి నారదుడు హిమవంతుడి యింటికి వెళ్ళాడు. హిమవంతుడు ఆయనకు అతిథి సత్కారాలు చేసి, "స్వామీ! నా వల్ల తమకు కావలసిన కార్యం ఏదైనా ఉంటే సెలవియ్యండి" అన్నాడు.

"నేను తపస్సు చేసుకుందామనుకుంటున్నాను. నిర్విఘ్నంగా నా తపస్సు కొనసాగే చోటేదని బ్రహ్మనడిగితే, నీ ఆధీనంలో ఉన్న ప్రస్రవణ పర్వతం మీద ప్రసవకందరం ఉందనీ, అక్కడ బ్రహ్మాండమైన వటవృక్షం ఉన్నదనీ, అక్కడే శివుడు తపస్సు చేసి, పార్వతిని సంపాదించుకున్నాడనీ, అక్కడ నా తపస్సు నిర్విఘ్నంగా సాగుతుందనీ అన్నాడు. నాకా ప్రదేశం కావాలి" అన్నాడు నారదుడు. హిమవంతుడు "సరే" నన్నాడు.

నారదుడు ప్రసవకందరంలోని వటవృక్షం క్రింద తపస్సు ప్రారంభించాడు. దేవేంద్రుడు యీ వార్తవిని కంగారుపడి, నారదుడి తపస్సు భగ్నం చేయటానికి రంభాది అప్సరసలను పంపాడు. అప్సరసలు ప్రసవకందరం చేరి, నారదుడి సమీపంలో నృత్యగీతాలు సాగించారు. నారదుడు ఏమాత్రం చలించక, అప్సరసలను చూసి నవ్వి, వారిని దేవలోకం వెళ్ళిపొమ్మన్నాడు. శాపం తప్పినందుకు సంతోషించి వారు వెళ్ళిపోయారు. కొంతకాలం తరువాత నారదుడు తపస్సు చాలించి, కైలాసానికి వెళ్ళి శివుడిని దర్శించాడు. శివుడు నారదుని చూసి సంతోషించి, విశేషాలమేమిటి అని అడిగాడు.

"నీవు తపస్సు చేసిన ప్రసనకందరంలోనే నేనూ తపస్సు చేశాను. తేడా ఏమిటంటే, మన్మథుడు పార్వతి ద్వారా నిన్ను ఆకర్షించినప్పుడు నీకు మనో నిగ్రహం లేకపోయింది. కోపావేశంలో మన్మథుణ్ణి భస్మం చేశావు. కానీ పార్వతిని స్వీకరించి అతనికి ఓడావు. నన్ను కూడా మన్మథుడు అప్సరసల ద్వారా చలింపజేయ చూశాడు. నేను ఆగ్రహించలేనూ లేదు; మన్మథుడికి లొంగిపోనూ లేదు; అప్సరసలను పంపించి వేశాను" అన్నాడు నారదుడు గర్వంగా. శివుడు కొంచెం ఆలోచించి, "ఈ విషయం విష్ణువుతో చెప్పనని మాట యివ్వు" అన్నాడు. నారదుడు సరేనని, శివుడి వద్ద సెలవు తీసుకుని వైకుంఠానికి వెళ్ళాడు. విష్ణుమూర్తి నారదుడికి స్వాగతం తెలిపి, విశేషాలడిగాడు.

నారదుడు తన తపస్సు గురించీ, కైలసంలో తనకూ శివుడికీ

జరిగిన సంభాషణ గురించీ విష్ణువుతో చెప్పి, "ఈ విషయం నీతో చెప్పవద్దని శివుడు బ్రతిమిలాడుకున్నాడు" అన్నాడు. "అలాంటప్పుడు నీవు నాకు యిదంతా చెప్పకుండా ఉండవలసినది. సరే యీ విషయాన్ని ఆ బ్రహ్మకు మాత్రం చెప్పకు" అన్నాడు విష్ణువు.

నారదుడు విష్ణువు వద్ద సెలవు తీసుకుని, సత్యలోకానికి బ్రహ్మ దర్శనానికి వెళ్ళాడు. కాని దారిలో ఏదో తారుమారు జరిగింది. అతనికి పూర్వం ఎప్పడూ తెలియని ఒక నగరం తగిలింది. తాను ఎలా దారి తప్పిందీ ఊహించ లేకుండా నారదుడానగరం ప్రవేశించాడు. అక్కడి ప్రజలు నారదుడికి ఎంతో ఆదరం చూపి, రాజు దగ్గరకి తీసుకుపోయాడు.

ఆ రాజు పేరు శీలనిధి. అతని కుమార్తె విశ్వమోహినికి స్వయంవరం మరునాడే. రాజు తన కుమార్తెను నారదుడికి చూపించి, ఆమె చేత ప్రణామం చేయించి, నారదుణ్ణి ఆశీర్వదించమన్నాడు. విశ్వమోహినిని చూడగానే నారదుడికి మతిపోయింది. పైకి ఆమెను ఆశీర్వదించి, నారదుడు లోలోపల ఆమెకోసం దహించుకుపోసాగాడు. ఆ పరిస్థితిలో ఏమి చేయడానికి నారదుడికి పాలుపోలేదు.

నారదుడు విష్ణువును ధ్యానించాడు. విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. నారదుడు తన సమస్యను వివరించి, "ఎలాగైనా రేపు రాజ కుమార్తె నన్నే వరించే లాగా అనుగ్రహించండి" అని ప్రార్థించాడు.

విష్ణువు నవ్వి "భయపడకు. నీకు మేలు కలిగేటట్లు నేను చూస్తాను" అని అంతర్ధానమయ్యాడు. ఇక విశ్వమోహిని తనదే అనుకున్నాడు నారదుడు.

- సశేషం

**శరీరంతో ఏకత్వం పొందిన 'నేను'ను 'అహం వృత్తి' అని అంటారు. ఆత్మతో ఏకత్వం పొందిన 'నేను'ను 'అహం స్ఫురణ' అని అంటారు. అహం వృత్తి మెలకువలోనే ఉంటుంది. అహం స్ఫురణ ఎల్లవేళలా ఉంటుంది. సాధకుడు మెలకువలోనే ఈ 'అహం స్ఫురణ'ను పట్టుకోవాలి.**

- శ్రీరమణులు

# పరి ప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

శాస్త్రకారులు, పండితులు మహాత్ముల దర్శనార్థం వచ్చినప్పుడు లేవనెత్తే సందేహాలలో ధ్యాన ప్రక్రియ అతిముఖ్యమైనది. అష్టాంగయోగాలైన యమ, నియమ, ఆసన, ప్రాణాయమ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధిలలో ధ్యానము ఆరవది. అయితే చాలా మంది సాధకులు సాధనని ధ్యానంతో ప్రారంభిస్తారు కదా! మరి ధ్యానానికి ముందు ఉన్న ఐదు యోగాలను సాధించకుండా అది సాధ్యమా అనేది వారి సందేహము.

సద్గురుదేవులు అటువంటి సందేహాలు సాధకులకు కలగకుండా



తమ సాధనని కొనసాగించటానికి వీలుగా తమ బోధామృతంలో అనేక సూచనలను తెలియ జేసేవారు. ముందుగాధ్యానానికి ఉపక్రమించటానికి ముందున్న యెాగ ప్రక్రియల గురించి తెలుసుకుని సద్గురుదేవుల సందేశాన్ని దానికి సమన్వయించుకుంటే సందేహ నివృత్తి అవుతుంది. 'యమ' అంటే భావన ద్వారాగాని, వాక్కు ద్వారాగాని, క్రియ ద్వారాగాని ఇతరులను నొప్పించక పోవటం. అలాగే 'నియమ' అంటే పరిశుద్ధ మనస్సుతో భగవత్ సంబంధితమైన గ్రంథాలను అధ్యయనం చేయటం. ఇక 'ఆసన' అంటే దేహాన్ని స్థిరంగా ఒక ప్రశాంతమైన ప్రదేశంలో కూర్చోబెట్టటం. దేహం స్థిరంగా ఉంటే మనస్సు స్థిరంగా ఉంటుంది. దాని ద్వారా ఇంద్రియాల సంయమనం సాధించవచ్చు.

శ్రీసద్గురుదేవులు ధ్యానం గురించి ప్రబోధన చేస్తూ "అది మానసిక ఆరాధన. దానిని సాధించటానికి ఆసన శుద్ధి కావాలి" అనేవారు. ఆసన శుద్ధిని సాధించిన తరువాత ధ్యాన ప్రక్రియలో పాల్గొనే సాధకుడు మనస్సుని అంతర్ముఖం చేసి, మనస్సు ద్వారా చెలరేగే చిత్కళలను అధిగమించటానికి సద్గురుదేవులు చేసిన బోధను మననం చేయమనేవారు. తత్ఫలితంగా మనస్సు స్థిరపడుతుంది. మనస్సు స్థిరపడితే ఇంద్రియాలన్నీ శాంతిని పొందుతాయి. దానిని సాధిస్తే ఇంక కావలసినదేముంది? అదే ప్రత్యాహారం అంటే. ధ్యానంలో ప్రాణాయామ ప్రక్రియ తప్పక నియమ బద్ధంగానే ఉంటుంది. అందువలన సద్గురుదేవులు బోధించినట్లుగా సాధకులు ధ్యానం చేయాలనే ఆకాంక్ష, పట్టుదల కలిగిఉంటే మిగిలిన యోగ ప్రక్రియలన్నీ సహజంగా నీ ఆధీనం లోనే ఉంటాయి" అన్నారు.

(గత సంచిక తరువాయి) **సద్గురు శ్రీ యాత్రా దర్శన్** -పి. సుధారాణి

12-5-2014

ఉదయం దర్శనానికి వెళ్ళాము. హిమాచల్ ప్రదేశ్‌లోని ఊనలో ఈ ప్రదేశం ఉన్నది. అమ్మవారి పాదాలు ఇక్కడ పడ్డాయి. ఇది శక్తిపీఠం. అమ్మవారు పిండి రూపంలో ఉన్నారు. దశమహా విద్యలలో ఒక్కరైన 'ఛిన్నమస్తికాదేవి'గా కూడా అమ్మవారిని కొలుస్తారు. రాక్షసులతో యుద్ధం చేసి అలసిపోయి, తన చెలికాండ్రు అయిన యోగినులు, అజయ, విజయల యొక్క దాహాన్ని తీర్చటానికి వేరే ఉపాయం లేక అమ్మవారు తన తలను తానే ఖండించుకుని ఆ రక్తధారలతో వారి దాహం తీర్చింది. అందుకే ఛిన్నమస్తిక అయింది. అర్థరాత్రి ఛిన్నమస్తికాదేవి ఉపాసన మంచి ఫలితాన్నిస్తుంది. శత్రు విజయానికి, రాజ్యప్రాప్తికి ఆమెను ఉపాసిస్తారు. దిశలే ఆమెకు వస్త్రాలు. ఆమె నాభిలో యోని చక్రం ఉంది. కృష్ణ (తమస్సు), రక్త (రజస్సు) గుణాలు కలిగిన సఖురాండ్రు సదా ఆమెతో ఉంటారు. ఆమె తన శిరస్సుని ఖండించుకుని, సజీవంగా ఉండటం యోగ పరిభాషలో పరిపూర్ణ అంతర్ముఖత్వానికి ప్రతీక. అగ్ని స్థానమయిన మణిపూరకములో ఛిన్నమస్తికను ధ్యానిస్తారు.

స్థల పురాణం -

మాయిదాసు అనే భక్తుడు ఈ అమ్మవారిని ఈ స్థలంలో గుర్తించాడు. అతడు ఎల్లప్పుడూ అమ్మవారిని అర్చిస్తూ కాలం గడిపేవాడు. అన్నదన్నములు అతన్ని వదిలివేశారు. ఒకరోజు అతడు అత్తగారింటికి వెడుతూ అడవిలో అలసి ఒక వృక్షం క్రింద పడుకున్నాడు. దివ్యతేజస్సుతో వెలుగుతూ చిన్నపాప తనకు గుడికట్టి సేవచేయమని కలలో కనబడి ఆదేశించింది. అతను నిద్రలేచి ఆ కలకు ఎక్కువ ప్రాముఖ్యతనివ్వకుండా అత్తగారింటికి వెళ్ళాడు. తిరిగి వెళ్ళేటప్పుడు అక్కడే విశ్రమించాడు. అదే కల అతనిని వెంబడిస్తుంటే అతను భయపడ్డాడు. దుర్గామాతను శ్లోకాలతో కీర్తిస్తూ చాలాసేపు అక్కడే ఉన్నాడు.

ఆ తల్లి సింహారూఢియై దర్శనమిచ్చి "నేను చాలా కాలం పిండిరూపంలో ఈ వృక్షం క్రిందే ఉన్నాను. నాస్తికులు ఈ ప్రదేశం

ఆక్రమించగా ప్రజలు నన్ను మరచారు. నీవు నా భక్తుడివి కనుక నన్ను వెలికి తీసి అర్చించి సేవ చెయ్యి. నేను ఛిన్నమస్తికాదేవిని. నీ చింతనలను కూడా దూరం చేశాను కనుక చింతాపూర్ణి అని కూడా పిలువబడతాను” అని పలికింది.

‘దుర్బలుడనైన నేను ఈ భయంకరమైన అడవిలో నిన్ను ఒంటరిగా ఎలా సేవించుకోగలను?’ అని ప్రార్థించగా, జగన్మాత అతనికి “ఓం ఐం క్లీం హ్రీం చాముండాయై విచ్చే” అనే మంత్రాన్ని ఉపదేశించింది.

“ఈ అడవి మూలానికి వెళ్ళి పెద్దరాయి తొలగించు, నీరు ప్రవహిస్తుంది. దానితో నన్ను అర్చించు. కాలక్రమాన భక్తులు నన్ను అర్చించి చింతలను పోగొట్టుకుని, నా మహిమను గుర్తించి, నాకు ఆలయం నిర్మిస్తారు. వారు ఇచ్చే విరాళాలతో నీ జీవితం కూడా గడిచిపోతుంది” అని దీవించింది.

మాయదాసు ఆ విధంగానే చేసి కృతార్థుడయ్యాడు. అతడు తొలగించిన పెద్దరాయి ఇప్పటికీ గుడిలో ఉంది. ఆ నీరు ప్రవహించిన చోటులో ఇప్పుడు తటాకం ఏర్పడింది. ఆ నీటితోనే అమ్మవారికి అభిషేకాలు చేస్తారు.

చింతాపూర్ణి నుండి మధ్యాహ్నం భోజనం చేసి బయలుదేరాము. భగళాముఖి అమ్మవారిని దర్శించుకున్నాము. దశమహావిద్యలలో ఒక రూపం. ఎరుపురంగు కాంతులీనుతూ, అందమైన చిన్నరూపంతో ఉన్నది అమ్మ. గుడి లోపలికి చాలా మెట్లు దిగి వెళ్ళాక చిన్నగుడిలో పెద్ద శివలింగం దర్శించాము. దగ్గరకు వెళ్ళి అభిషేకం చేసుకున్నాము.

- సశేషం

**ఇంద్రియ నిగ్రహం లేనివారికి రాగద్వేషాలు నశించవు. అవి నశించని వారికి జీవకారుణ్యం కలుగదు. భూత దయ లేనివారికి మోక్షం బహుదూరం!**

# ఏమని ప్రార్థింపనూ మా గురుదేవుని?

- పెనుమాక నాగేశ్వరరావు

ఏమని ప్రార్థింపనూ మా గురుదేవుని  మా కంటి వెలుగుని మా ఇలవేల్పునీ
మహానుభావునీ ఏమని ప్రార్థింపనూ, నేనేమని ప్రార్థింపనూ
అడుగకనే తీర్చారు ఎన్నెన్నో కోరికలు, సమకూర్చారు ఆవాసాలు, సావాసాలు
నెరవేర్చారు ఎన్నెన్నో సంకల్పాలు, అందించారు సంకేతాలు, సాంగత్యాలు

చెప్పలేని లెక్కలేని చిక్కులెన్నో చక్కబెట్టినారు
అదుపులేని హద్దులేని బుద్ధినెంతో బుజ్జగించారు
ఓపలేని, ఓర్వలేని బాధలెన్నో బాపినారు
మరుపురాని మరువలేని జ్ఞాపకాలనెన్నో మిగిల్చినారు ॥ఏమని॥

వాసమిచ్చినారు, గ్రాసమిచ్చినారు, అభయమిచ్చి  దీవించారు,
భయములేని బాధలేని బ్రతుకునిచ్చినారు, బ్రతుకుతెరువు చూపించినారు
భక్తినిచ్చినారు, భుక్తినిచ్చినారు, శక్తినిచ్చినారు, శాంతినిచ్చినారు
ఇన్నిచ్చిన గురుదేవులు ముక్తినివ్వకపోతారా! అందుకనే..... ॥ఏమని॥



# శతాక్షి – శాకంబరి – దుర్గ

- రావి శోభ

పూర్వకాలంలో దుర్గముడనే రాక్షసుడు ఉండేవాడు. వాడు బ్రహ్మ గురించి ఘోరమైన తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. వాడు దేవ బ్రాహ్మణ గణాల దగ్గర ఉన్న సమస్త వేదాలు తనని చేరేలాగ, దేవతలని జయించేలాగ వరాలు కోరాడు. అంతే! అతనికి ఆ వరాలనిచ్చాడు బ్రహ్మ.

బ్రాహ్మణులు వేదాలను మరచి పోయారు. బలవంతులు బలహీనులై పోయారు. చేలు బీడులయి పోయాయి. నదులు ఎండి పోయాయి. అకాల మృత్యువులు, అనారోగ్యాలు పెరిగిపోయాయి. భూలోకం అంతా అయోమయం అయిపోయింది.

దుర్గముడు దేవతల మీద దండెత్తాడు. వారిని కఠిన హింసల పాలుచేశాడు. బ్రాహ్మణులు మంత్రాలను మరచిపోవటం వలన మంత్రాధి నాధులైన దేవతలు రాక్షస బాధలతోను, సంస్కారాలు లేక కృశించి పోయారు. అప్పుడు బ్రాహ్మణులు అంతా కలిసి ఆ పరాశక్తిని ప్రార్థించారు.



దీనాతిదీనులైన వారి స్తోత్రాన్ని మన్నించి, వేదాన్ని మరచి పోయినా, తనని మాత్రం మరవని వారిపట్ల అమితమైన కృపని చూపిస్తూ వారికి ప్రత్యక్షమైంది. అనావృష్టితో అల్లాడుతున్న ఈ భూమిమీద 9రోజులపాటు తన కనుల నుండి నీటిని కురిపించింది. ఆ నీటితోనే నదులు సముద్రాలు నిండాయి. అలా వందసార్లు కురిపించటం వలన ఆవిడ 'శతాక్షి' అయింది.



అనంతరము శాకాహారము, పళ్లను వారికి అనుగ్రహించింది. పశుగ్రాసము వారికి దయచేసింది. దానివలన ఆమె 'శాకంబరి' అయింది.

లోకం పచ్చగా ఉందనగానే భగ్గుమన్నాడు దుర్గముడు. దేవి స్వయంగా యుద్ధంలో పాల్గొని 10 రోజులపాటు యుద్ధం కొనసాగించి, 11వ రోజున దేవి, దుర్గముడు ముఖాముఖీ ఢీ కొన్నారు. పరాశక్తి బాణాలు నాలుగు

గుల్ఫాలమీద, ఒకటి సారథిమీద, రెండు దుర్గముడి కాళ్ళమీద, రెండు భుజాలమీద, ఒకటి జెండామీద, అయిదు పంచ ప్రాణాల మీద నాటించి వాడిని సంహరించింది. దేవతలంతా ముక్తకంఠంతో దేవిని కీర్తించారు. దుర్గముడిని చంపిన కారణంగా ఆ దేవికి 'దుర్గ' అని పేరు వచ్చింది.



ఆ తల్లిని 'శాంకబరి- శతాక్షి- దుర్గ' అని స్తుతించినవారు 'మాయ' అనే తెరను చీల్చుకుని తన నివాసం చేరుకుంటారని 'వరం' ఇచ్చింది.

"సత్సంగమనగా సద్వస్తువుతో కలసి ఉండటం. సద్వస్తువు నిజానికి ఒక్క ఆత్మయే. కాని, అది తెలుసుకోలేనంత కాలం, తెలిసికొన్న సత్పురుషుని సన్నిధిలో ఉండటమే సత్సంగం అవుతుంది. ఆ సత్సంగం ఆత్మ సాక్షాత్కారాన్ని ప్రసాదిస్తుంది. ఇదే నిజమైన సత్సంగం"

**'సమర్థ సద్గురు' కి శుభాభినందనలతో**

**వంకిన అచ్చుత రామారావు & అమ్మాజీ**



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

అధీర బిమ్బాధర విభ్రమేణ ।హర్షార్ద్ర వేణుస్వర సమ్పదా చ।
అనేన కేనాపి మనోహరేణ హ హన్త హహన్తా మనోధినోతి ॥

తాత్పర్యము - కదులుచున్న మోవి సొంపుచేతను, ఆనంద పూర్ణమైన పిల్లనగ్రోవి మ్రోత కలిమిచేతను ఎంతయో మనోహమైన ఒక వస్తువు నామమును తలచుచున్నది. ఆహా! ఏమి చిత్రము!!



తనకి ఎదురుగా నిలబడిన తనయుని చూసి తల్లి విస్తుపోతూ అడిగింది "ఏరా! ప్రొద్దున్న గోవులను తోలుకు వెళ్ళేటప్పుడు నిన్ను ఎలా పంపించాను? ఇప్పుడు ఎలా ఉన్నావు? వెళ్ళేటప్పుడు పూచిన పూల మొక్కలాగ ఉన్నావు కదరా! ఇప్పుడు గాలికి రాలిన ఆకులులేని బోసి మొక్కలా ఉన్నావు! ఏం జరిగింది చెప్పు?" అని గర్జించి అడిగింది యశోద కన్నయ్యను.

తను ఒంటి నిండా ఎన్ని నగలు పెట్టిందో! ఇప్పుడు ఒక్కటి కూడా లేదు! దొంగలెవరైనా దోచుకున్నారా? వాడిని రెండు వాయించి అన్నీ లాక్కున్నారా? భయపడుతూ అడిగింది ఆ తల్లి. 'దొంగలు దోచుకుంటే కనుక ఏడుపు ముఖం పెట్టుకురావాలి కాని, వీడేమిటి ఇలా ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు!' అనుకుంది.

కన్నయ్య ముఖంలో నవ్వు చెదరకుండా "అమ్మా! నా వెనకాల ఎవరున్నారో చూడు" అంటూనే తన వెనకు నుండి ముందుకు లాగాడు ఒక లేడి కూనను. దాని మెడలో కన్నయ్య రత్నాల హారాలు, ముత్యాల గొలుసులు, చెవులకి ఎలా తగిలించాడో కాని కుండలాలు, ముందు కాళ్ళకి పచ్చల కంకణాలు, వెనుక కాళ్ళకి అందెలు, కడియాలు అది నడచి వచ్చేసరికి గల్లుమని మ్రోగాయి. నెత్తిమీద రావి రక్ష, చంద్రవంక కూడా మెరుస్తున్నాయి. అవి చూసి ఆశ్చర్యపోయింది! 'అయితే నీ వేషం అంతా దానికి వేశావన్నమాట అంది యశోద కసురుకుంటూ.

"అవునమ్మా! వేషాలు వేసేవాడిని, వేయించేవాడిని కూడా నేనే కదమ్మా!" అన్నాడు. కదలకుండా స్థిరంగా నిలబడిన కన్నయ్య తిరిగి మాట్లాడుతూ "వాళ్ళమ్మ నొప్పులు పడుతూ, నేను మురళీ వాయిస్తుంటే

ఆనందంగా వింటూ దీన్ని కన్నదమ్మా. అందుకే దీనికి నేనంటే చాల ప్రేమ. ఎక్కడ ఉన్నా, నేను మురళీ వాయిస్తే చాలు పరుగు పెడుతూ వచ్చేస్తుంది నా దగ్గరకు. చివరకు వాళ్ళ అమ్మ దగ్గర ఉన్నా సరే, పాలు త్రాగుతున్నా మానేసి వచ్చి నా ఒళ్ళో దూరుతుంది. అందుకే నేనీ బుజ్జి ముండకి ఈ రోజు ఇవన్నీ అలంకరించాను. నువ్వు చూసి ముచ్చట పడతావని నీ దగ్గరకు తీసుకువచ్చాను. కోపం పడకే అమ్మా!" అన్నాడు గారంగా.

యశోదమ్మ లేడికూనని, కన్నయ్యని మార్చిమార్చి చూస్తూ "అచ్చంగా అది కూడా నీలాగే ఉందిరా. ఇప్పుడు నీకు దానికి తేడా కనిపించటం లేదు" అన్నది కన్నయ్య ఇచ్చిన తెలివితో. "నువ్వు ఏం చేసినా కూడా నాకు బాగానే ఉంటుంది రా" అని కూడా అన్నది. "దానికి 'మంగళ' అని పేరు కూడా పెట్టానమ్మా" అన్నాడు కన్నయ్య.

రాత్రి అయింది. చీకట్లు కమ్ముకున్నాయి. మంగళ అనే మధురమైన పిలుపు వింటూనే చేతిలో పని ఎక్కడిదక్కడే ఒదిలివేసి నాలుగంగల్లో బృందావనానికి పరుగెత్తింది 'మంగళ' అనే గోపిక. వస్తూనే కన్నయ్య ఒడిలో ఉన్న లేడి కూనను చూసి 'ఆహా! ఏమి అదృష్టం దీనిది. ఇది ఎంత అదృష్టం చేసుకుందో' అన్నది కన్నయ్యతో. "అయితే దీని కథ చెబుతాను విను" అన్నాడు కన్నయ్య శ్రద్ధగా వింటోంది గోపిక మంగళ.

"మునుపు ఇది అలకా నగరంలో యక్షరాజైన కుబేరుని సేవకునిగా ఉంటుండగా శివభక్తుడైన ఇతనిని ప్రతిరోజు తన శివపూజకి ఇంద్రుని నందన వనంలోని పారిజాతాలు తెమ్మని పంపించేవాడు. వీడు చాల శ్రద్ధగా తెచ్చేవాడు. ఒకనాడు పూలు తీసుకుని వస్తుండగా ఇంద్ర సభలో నుండి చాలా మధురమైన గానం వినిపిస్తుండగా అక్కడ వింటూ క్షణం ఆగాడు. తిరిగి రాగానే కుబేరునికి శివపూజకు ఆలస్యం అయిందని చాలా కోపం వచ్చింది. వెంటనే " నువ్వు భూ లోకంలో జన్మించు. ఏ గానానికి నువ్వు మైమరచి పనికి ఆలస్యం చేశావో ఆ గానమే నీకు బంధకారణ మవుతుంది" అని శపించాడు. ఆ శాపవశాన లేడిపిల్లగా పుట్టాడు.

(తరువాత భాగము 22వ పేజీలో చూడండి )

## రాధ భక్తి

సేకరణ - మురళీ

(23-12-1976న శ్రీబాబు అందించిన దివ్యబోధ)

"రాధ భక్తి అమితమైనది. మనస్సు ఒక చోట, తనువు ఒకచోట ఉండేది కాదు. రాధది ఏకాగ్రమైన భక్తి. అటువంటి రాధకు కూడ ఒకసారి అహంకారం కలిగింది. వాస్తవానికి కృష్ణనామ మాధుర్యాన్నంతా రాధ పొందగలిగింది. లక్ష్యార్థం మీద తన దృష్టిని నిలిపింది. ఆనందం పొందింది. అందువలన నాకు తెలిసినంత, నేను పొందినంత మాధుర్యాన్ని ఎవరూ పొందలేరు కదా అనుకుంది. శ్రీకృష్ణ పరమాత్ముడు ఆమె అహంకారాన్ని తొలగించాలని నిర్ణయించుకున్నాడు.

"ఈ రోజు ఏకదశి కదూ! రాధా! నీవు పంచభక్ష్య పరమాన్నాలు పళ్ళెములో పెట్టుకుని, యమునను దాటి యమునకు అవతల చూతఫల వృక్షములు ఉన్న తోటలో తపస్సు చేసుకుంటున్న దూర్వాస మహాముని దగ్గరకు వెళ్ళి, అవన్నీ ఆయన కుక్షిలో వేస్తే ఎంతో పుణ్యం వస్తుంది. వెళ్ళిరా." అన్నాడు కృష్ణపరమాత్మ. 'ఆ యమునా నది పొంగి పొర్లుతూ ఉంటుంది. దానిని దాటటం ఎలా? కృష్ణయ్య అన్నీ ఇలాగే చెబుతాడు' అనుకుంది రాధ. "అస్ఖలిత బ్రహ్మచారియైన కృష్ణపరమాత్మ దారి ఇమ్మన్నాడు' అని చెప్పు యమున దారి ఇస్తుంది" అని చెప్పాడు కృష్ణపరమాత్మ.

'తమ సంగతంతా నాకు తెలుసుగా! అంతమంది భార్యలున్నారే, ఆజన్మబ్రహ్మచారి అంటాడేమిటి?' అనుకుంది రాధ మనస్సులో. అయినా కృష్ణుడు చెప్పింది చేయటం ముఖ్యం కదా! అనుకుని, అన్నీ తీసుకుని యమున ఒడ్డుకు వెళ్ళి, 'అస్ఖలిత బ్రహ్మచారియైన కృష్ణపరమాత్మ దారి ఇమ్మన్నాడు' అనేసరికి యమున మనస్సులో 'ఇంకా కృష్ణుడికి గుర్తున్నాను అంతే చాలు' అనే ఆనందంతో దారియిచ్చి ధన్యురాలిని అనుకుంది. రాధ యమున దాటగానే మరల పొంగి పొరలుతోంది.

రాధ తిరిగి వస్తూ 'అయ్యో! ఇప్పుడు ఎలా యమునను దాటటం' అనుకుంది. అది గ్రహించిన దూర్వాసముని "నిత్య ఉపాసియైన దుర్వాస మహర్షి దారి ఇమ్మన్నాడు' అని అడుగు దారి ఇస్తుంది" అని చెప్పాడు. రాధ తన మనస్సులో 'ఇప్పుడేగా నేను యిచ్చినవన్నీ తీసుకుని తిని నిత్య

ఉపాసకుడు అంటాడేమిటి?' అనుకుంటూ, యమున దగ్గరకు వచ్చి మహర్షి చెప్పినట్లే అడిగింది. రాధ అడగగానే, మనస్సులో 'అంత పెద్ద మహర్షికి నేను గుర్తున్నానే!' అని ఆనందంతో యమున దారి యిచ్చింది. రాధ ఇవతలి ఒడ్డుకు చేరగానే మరల పొంగిపొరలుతోంది.

ఇంటికి చేరిన రాధ, తన సందేహం తీర్చుకునేందుకు శ్రీకృష్ణ పరమాత్మ దగ్గరకు వెళ్ళింది. "నీ మనస్సు ఎవరిది?" అని కృష్ణుడు రాధను ప్రశ్నించాడు. "ప్రాపంచిక విషయాలన్నీ శరీరానికేగాని, మనస్సుకు కాదు. కృష్ణుని మనస్సు రాధది, రాధ మనస్సు కృష్ణునిది. అసలు మనస్సే లేని వాడికి అవన్నీ ఎక్కడివి? అందువలన కృష్ణపరమాత్మ ఆజన్మబ్రహ్మచారి. దూర్వాసమహర్షి నిత్యఉపవాసి" అన్నాడు కృష్ణపరమాత్మ.

'నా అజ్ఞానాన్ని తొలగించి, నా అహంకారాన్ని పోగట్టారు స్వామీ!' అని రాధ కృష్ణుడికి ప్రణమిల్లింది. అహంకారం తొలగగానే ఎంతో ఆనందాన్ని పొందింది రాధ" అన్నారు శ్రీబాబు.

---

(కృష్ణ కర్ణామృతము - 20వ పేజీ నుండి)

లేడికి వేణుగానం అంటే ప్రీతి. అందుకే వేటగాడి వేణునాదం వింటూ మైమరచి వాడికి పట్టుపడిపోతుంది పాపం! అయితే వీడు పరమ శివభక్తుడు గనుక వాడికి శాపమే వరమైంది. నేను వాయించే వేణుగానం వినేందుకు అర్హుడైనాడు. నన్ను ఆశ్రయించి, శాపవిముక్తుడై నా సన్నిధిని పొందాడు. ఇలా తరిస్తున్నాడు. ఇక వాడికి శాపము లేదు పాపము లేదు. అన్నీ సమసిపోయినట్లే" అన్నాడు కన్నయ్య.

శాపము తీరిపోయి నీ ఒడిలో చేరింది. ఎంత అదృష్టమో! అంతకన్న ఏం కావాలి? మురళి ఊదేటప్పుడు కదులుతున్న నీ పెదవుల అందం ఆనందపూర్ణమైన నీ వేణుగానంతో శోభించే నీ దివ్యరూపం మా మనస్సులో నిలిచి క్షణం, క్షణం నిన్ను చూడాలనిపిస్తుంది మా గోపికలందరికి. అదేమి చిత్రమోగాని!" అన్నది మంగళ కన్నయ్య సన్నిధిలో దివ్యానందాన్ని అనుభవిస్తూ.

(గత సంచిక తరువాయి) **భక్త మార్కండేయ** - కామేశ్వరీ ప్రసాద

భక్త మార్కండేయుడు ఆ యమకింకరులను చూసి భయపడి శివలింగమును కౌగలించుకుని 'నన్ను వీరి బారినుండి రక్షించమని' తనువు, మనస్సు మరచి, అంతర్ముఖుడై, 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరిని స్మరిస్తూ ఉండిపోయాడు. ఇక యమకింకరులు ఏమీ చేయలేక వెను తిరిగి పోయారు. తరువాత యమధర్మరాజే స్వయంగా రాగా, శంకరుడు తన త్రిశూలాన్ని యమధర్మరాజు మీద ప్రయోగింపగా ఆయన హడలిపోయి శంకరుని క్షమించమని వేడగా, శంకరుడు యమధర్మారాజును మార్కండేయుని వదిలిపెట్టి వెనుతిరిగి వెళ్ళి పొమ్మన్నాడు. ఆ విధంగా మార్కండేయుడు మృత్యుంజయుడు అయ్యాడు.



మార్కండేయుడు తపస్సు చేసుకుంటుండగా శంకరుడు ఆనందించి ప్రత్యక్షమై 'నీ కోరిక ఏమిటి?' అని ప్రశ్నించగా 'నేను నారాయణుని గురించి తపస్సు చేయదలచాను దానికి నాకు శక్తిని ప్రసాదించు. నా రెండవ కోర్కె నేను నారాయణుని మాయను తెలుసుకోవాలని ఉంది' అన్నాడు. అలాగేచేశాడు.



అలా కొంతకాలం తపస్సు చేయగా ప్రపంచమంతా మునిగి పోయి, జల మయమైపోయి, కాలాంజనముగా ఒక మనిషి కనిపించగా మార్కండేయుడు అతని దగ్గరగా వెళ్ళి చూసేసరికి, అతని ముఖం గుండా మార్కండేయుడు అతనిలో ప్రవేశించి లోపల చూడగా అతనికి పదునాలుగు భువనాలు కనపించాయి. అక్కడ తపస్సు చేసుకునే ఋషులు, భక్తులు అనేకమంది కనిపించారు. తిరిగి మార్కండేయుడు ఆ ముఖం గుండానే బయటకు వచ్చాడు. 'ఓహో! ఇదంతా శ్రీహరి

మాయజాలమే' అని నిశ్చయించుకుని మార్కండేయుడు తిరిగి తపస్సు ప్రారంభించాడు.



తన మాయను ఇంకా చూపదలచిన నారాయణుడు ప్రపంచం అంతా జలమయం చేసి, అందులో ఒక మర్రి ఆకు మీద చిన్నబాలుడిలా నోటిలో తన కాలి బ్రొటనవేలును ఉంచుకుని, అంతా చీకటిమయం చేసి, తన దివ్యతేజస్సుతో మార్కండేయునికి దర్శనమిచ్చాడు. ఆ చీకటిలో మార్కండేయుడు చాల భయపడుతూ ప్రభువు యొక్క తేజోరూపాన్ని చూశాడు. వెంటనే 'కుమారా! నా దగ్గరకురా!' అని పిలిచాడు నారాయణుడు. మార్కండేయుడు నమ్మలేదు. ప్రభువు ఊరుకుంటాడా? నారాయణుడు అతనికి గుర్తుచేస్తూ "నాయనా! కాలాంజన పురుషుడను నేనే. నువ్వు నాలోని లోకాలన్నీ చూశావు కదా! నా మాయ అంటే అర్థం అయిందా? భయపడకు. ఇప్పుడు మరల నాలో ఉన్న లోకాలు చూడు. అప్పుడు నీకు తెలుస్తుంది. నేనేమిటో, నా మాయ ఏమిటో" అని మళ్ళీ మార్కండేయుణ్ణి తన ముక్కు పుటాలలో గుండా లోపలికి పంపాడు. మళ్ళీ అక్కడ కూడా  లోకాలు, ఋషులు, భక్తులు, నాగులు అన్నీ కనిపించాయి.

మార్కండేయుడు తన మనస్సులో 'నారాయణుని మాయను చూడాలని కోరుకున్నాను కదా! అందుకే ఇలా చూపించాడు. ఇదంతా ఆ పరమాత్ముని యొక్క చిద్విలాసమే' అనుకున్నాడు. తిరిగి మళ్ళా అక్కడ తపస్సులో మునిగి పదివేల సంవత్సరాలు తపస్సు చేసి, ఆయన ముఖస్తుగా మరల ఈ లోకానికి వచ్చాడు.

బయటకు వచ్చి వటపత్రం మీద ఉన్న బాలుని స్తుతించి 'స్వామీ! నీ లీలలు తెలియ తరమా!' అని వేనోళ్ళ పొగడగా నారాయణుడు ప్రత్యక్షమై, "మార్కండేయా! నీ భక్తికి మెచ్చాను. ఏం వరం కావాలో కోరుకో" అన్నాడు. 'ప్రభూ! ఈ శరీరంతో ఎల్లపుడూ నీ కృపకు పాత్రుడనై ఉండాలి. నాకు జననమరణాది అవస్థలు లేకుండా ఉండాలి' అని కోరుకున్నాడు. శ్రీహరి "అట్లే అగుగాక!" అని వరమిచ్చాడు. మార్కండేయుడు తన తపోమహిమతో ఇప్పటికీ చిరంజీవిగానే ఉన్నాడు.

## శ్రీ సద్గురు సన్నిధిలో మధుర క్షణాలు

- సుశీలా ప్రసాద

పరిధావి సంవత్సర అధిక శ్రావణపూర్ణిమ 31-7-1966 ఆదివారం నాడు శ్రీబాబు బచ్చు పాండురంగ శ్రీశైలరావుగారింట్లో ఉన్నారు. ఆనాటి సత్సంగ సమావేశంలో శ్రీబాబు తన బోధామృతాన్ని అందిస్తూ "ఇది భగవానుడు మనకు అదనంగా ప్రసాదించిన పూర్ణిమ. (అధిక శ్రావణ పూర్ణిమ). జన్మ పరంపరల నుండి మానువుణ్ణి తరింప జేయగలిగినది శ్రీశివ పంచాక్షరి మహా ఔషధం. ఆ ఔషధ సేవకు పత్యం విషం. అంటే విషయాదులకు దూరంగా ఉండటమే. విషాన్ని ఔషధంగా సేవిస్తే అనేక వ్యాధులను హరిస్తుంది. అవసాన దశలో ఉన్న ప్రాణాన్ని తిరిగి నిలపగలుగుతుంది.

'ఓం నమశ్శివాయ' అనే ఆరు అక్షరాలు మనలోని కామక్రోధాది షడ్వర్గాలను, శమదమాది షట్క సంపత్తిగా మార్చివేయ గలదు. నేను కాశీలో గంగానదిలో స్నానం చేస్తూ పంచాక్షరి స్వరూపుడైన విశ్వనాధుడే నాలో దివ్యకాంతులతో ప్రకాశిస్తున్న అనుభవంతో గంగానదిలో సాయంత్రం 6గం.ల దాకా అలా నిలచిపోయాను. సాయంత్రం గంగానదికి హారతులు జరుగుతున్న సమయంలో నాకు శరీర స్మృతి కలిగింది" అన్నారు శ్రీబాబు.



'తమరి బోధ చాలా బాగుంది బాబు' అన్నాను నేను. "బోధలో చాలా మంచి విషయాలు వచ్చాయి. సాధన చేసుకుంటే అనుభవంలోకి వస్తాయి" అన్నారు ప్రత్యక్ష పరమేశ్వరులైన శ్రీబాబు.

ఆ రోజు సాయంత్రం శ్రీబాబు తమ గదిలో ఒకకాలు ముడిచి, మరొక కాలు చాపుకుని నేల మీద కూర్చుని చంటిపిల్లవాడు తన పుస్తకాల బ్యాగ్‌ను సర్దుకుంటున్నట్లుగా, పులిచర్మం బ్యాగు సర్దుకుంటూ నన్ను పిలిచారు. ఆ ముగ్ధ మనోహర రూపంచూసి పరవశంతో నా మనస్సులోనే ఆ రూపాన్ని ఫొటో తీసి పెట్టుకున్నాను.

అక్కరలేని కాగితాలు కొన్ని తీసి శ్రీబాబు పారేశారు. 'పద్మనాభ

అష్టకం', ఇంకా మరికొన్ని కాగితాలు తీసినాకిచ్చి చదవమని ఉపయోగ పడితే తీసుకోమన్నారు. ఒక పొట్లం పడేశారు. అది తీసి చూస్తే ఏదో చెవుకి పెట్టుకొనే కెంపులా ఉంది. తీసి బాబుకిస్తే "అయ్యో!" అంటూ తీసి దాచుకున్నారు. ఒక చోట రాళ్ళ గుండీలు కనిపిస్తే "ఎక్కడ ఉన్నాయా అని వెతుక్కుంటున్నాను" అన్నారు.

శ్రీబాబు తిరిగి మాట్లాడుతూ సన్నమూతి వెడల్పు పొట్ట ఉన్న బిందెలో నీళ్ళుపోసి పెడితే ముందు పడిపోతుంది. తరువాత క్రమంగా గొయ్యి ఏర్పడి పడిపోకుండా నిలబడుతుంది. అలాగే మనస్సు ధ్యానంలో నిలపడం ద్వారా నెమ్మదిగా అలవాటు చేసుకోవాలి" అన్నారు.

14-1-2015 బుధవారం నాడు భోగి పండుగ సందర్భంగా
శ్రీ సద్గురుదేవుల శుభ ఆశీస్సులు భక్తులందరిపైన
సంతత ధారగా వర్షించుగాక!



## ఆత్మబలం

- చిర్రావూరు వెంకటరావు

కాంచీపురాధీశుడి కుమార్తెను ఒక పిశాచం ఆవహించింది. దేశ దేశాల నుండి మాంత్రికులను రప్పించారు. ఆ పిశాచాన్ని వదిలించ టానికి వారు శాయశక్తుల కృషి చేశారు. కానీ ఫలితం శూన్యం.

సదాచార సంపన్నులు, జ్ఞానమూర్తులు, మంత్రసిద్ధులు అయిన యాదవ ప్రకాశాచార్యులు తపో మహిమాన్వితులు కాబట్టి వారిని కూడా ఆహ్వానించమని కొంతమంది రాజుకు సూచించారు. ఆయన అమలు పరచాడు. వెంటనే ఆయన తన శిష్యులతో కలసి రాజస్థానం చేరుకుని, రాజకుమార్తెను చూసి మంత్రపఠనం ప్రారంభించాడు.

అప్పటి వరకు ఒక మూల కూర్చుని శూన్యంలోకి చూస్తున్న రాజకుమారి భయంకర రూపందాల్చి, గంభీరంగా "ఓయీ! మాంత్రికా! ఆ జన్మాంతం మంత్రాలు వల్లివేస్తున్నప్పటికీ నన్ను నీవేమీ చేయలేవు. నన్ను తరిమివేయటం నీ తరం కాదు. నేను తలచుకుంటే నిన్ను ఇక్కడి నుండి క్షణంలో తరిమివేయ గలను. నేను సామాన్య పిశాచిని కాదు. బ్రహ్మరాక్షసిని" అని గట్టిగా అరిచింది. ఆ మాటలకు యాదవ ప్రకాశాచార్యులు భయపడి అక్కడి నుండి తొలగిపోయి దూరంగా వెళ్ళి కూర్చున్నాడు.

అప్పుడు ఆయన శిష్యుడు, విశిష్టాద్వైత సంప్రదాయానికి మూల పురుషుడు అయిన శ్రీ రామానుజాచార్యులు రాజకుమార్తె ముందుకు వెళ్ళి ఆ పిశాచాన్ని ఉద్దేశించి "అయ్యా! దయనీయమైన ఈ దుర్దశ మీకు ఎందుకు ప్రాప్తించింది? కారణం ఏమిటో చెప్పగలరా?" అంటూ ఎంతో సౌమ్యంగా ప్రశ్నించాడు.

అప్పుడు రాజకుమార్తెను ఆవేశించిన బ్రహ్మరాక్షసి దుఃఖపూరిత స్వరంతో, ప్రార్థనా పూర్వకంగా "నాయనా! నేను వేదవేదాంగాలలో ఆరితేరినవాణ్ణి. నా విద్యను ఇతరులకు ఉపయోగపడకుండా దాచేసుకున్నాను. ఎవ్వరికీ నేను విద్యాదానం చేయలేదు. అందుకు ఫలితమే నాకీదుర్దశ వాటిల్లింది. నువ్వు పుణ్యమూర్తివి. పవిత్రమైన నీ హస్తాన్ని నా తలమీద ఉంచితే ఈ దుర్దశ నుండి నాకు విముక్తి లభిస్తుంది" అన్నది.

భగవందశగల శ్రీరామానుజాచార్యులు ఆ రాక్షసి కోరినట్లుగా రాజ కుమార్తె తలమీద తన చేతిని ఉంచి ధ్యానించటం ప్రారంభించిన మరుక్షణమే ఆ బ్రహ్మరాక్షసికి విముక్తి కలిగి, రాజకుమార్తెను వదలి వెళ్ళిపోయింది.

అక్కడ చేరిన వారందరూ శ్రీరామానుజాచార్యుల మహిమను, ఆత్మబలాన్ని వేనోళ్ళ ప్రశంసించారు. ఈ వార్త అన్ని రాజ్యాలలోను ప్రచారమై నాటి నుండి శ్రీరామానుజాచార్యులను దైవస్వరూపంగా భావించి పూజించసాగారు.



ఆలున్ బిడ్డలు తల్లిదండ్రులు ధనం। బంచు న్మహాబంధనం
బేలా నామెడ గట్టినాడ విక ని। న్నే వేళ జింతింతు, ని
ర్మూలంబైన మనంబులో నెగదు దు। ర్మోహాబ్ధిలో గ్రుంకి యీ
శీలామాలపు జింత నెట్లుడిపెదో। శ్రీకాళహస్తీశ్వరా!

తాత్పర్యము -

శ్రీకాళహస్తీశ్వరా! భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు, ధనము అనే గొప్ప బంధము నా కంఠమున కెందుకు ముడిపెట్టినావో తెలియుట లేదు. ఆ కుత్తుకచే నిన్నెపుడు స్మరించ గలుగుతాను? నీ యందలి భక్తి మొలుకే తొలగుటచే మనస్సులో వృద్ధి బొందుతూ ఉన్న మోహము అనెడి సముద్రంలో మునిగిన ఈ దుఃఖాన్నెట్లు తొలగించెదవో! కాబట్టి నన్ను దుఃఖ సముద్రము నుండి దాటింపుము.

- శ్రీకాళహస్తీశ్వర శతకము 9

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు

- రావి శోభ

అనంత సృష్టిలో భగవంతుడు అనేక రూపాలు, అనంతకోటి నామాలతో ప్రకాశిస్తూ ఎవరు ఏ రూపాన్ని ఆరాధిస్తే, ఆ రూపంతోనే వారిని అనుగ్రహిస్తున్నాడు. రూపాలు, నామాలు వేరైనప్పటికి, రక్షణ చేసి, కాపాడే శక్తి, కోరిన వరాలను అనుగ్రహించే 'శక్తి' మాత్రం ఒక్కటే.



'సుబ్రహ్మణ్యం' అంటే స్వత: బ్రహ్మత్వాన్ని కలిగినవాడు అని అర్థం వస్తుంది. 'సు' అంటే ఆత్మవస్తువు కాబట్టి ఆత్మతత్వంతో ప్రకాశించేవాడు అని కూడా అర్థం ఉంది. దేవసేనను పెండ్లి చేసుకుని, సమస్త దేవతా మూర్తులకు సేనాధిపతి అయి, 'దేవసేనాధిపతి' అయ్యాడు.

తనకు కలిగిన జ్ఞానానుభవాలను తన తండ్రియైన శంకరునితో పంచుకున్నాడు కాబట్టి 'స్వామికే' నాధుడు అయ్యాడు. అందుకే భక్తులు 'హే స్వామి నాధా! కరుణాకర దీనబంధో!' అంటూ స్తుతి చేస్తున్నారు.



'మాయ' అంటే అజ్ఞానానికి సంకేతం. సర్పం పైకి నల్లగా భయం కలిగించేదిగా కనిపించినా మన కంటికి కనబడని లోపల ఉన్న 'ఆత్మ జ్ఞాన సంపద' ద్వారా ప్రకాశిస్తోంది. దీన్ని కూడా నిగూఢ అర్థంతో చూస్తే పైకి కనిపించేది మాయ కాబట్టి మాయకు లోబడి చూస్తున్నారా? లేక లోపల ప్రకాశిస్తున్న జ్ఞాన సంపదకి నమస్కరిస్తున్నారా? అనేది అర్థం చేసుకోవాలి.

ఇన్ని సుగుణాలు కలిగి ఉన్నాయి కాబట్టే విష్ణుమూర్తికి పాన్పుగా, శంకరుని కంఠసీమలో హారంగా సుబ్రహ్మణ్యేశ్వరుడు విరాజిల్లుతున్నాడు.

వెయ్యి పడగలతో సమస్త భూమండలాన్ని మోస్తూ, నాలుగు పడగలతో ధర్మార్థ కామమోక్షాలను కాపాడుతూ, రెండు పడగలతో

దంపతులను కాపాడతాయి. ఒక్క పడగ విప్పి పైరు పచ్చని పంటకు గొడుగుపట్టి కాపాడుతున్నాడు.

సుబ్రహ్మణ్యుడు, నాగేంద్రుడు ఎవరు ఏ పేరుతో పిలిచినా శ్రీ కాళీవనాశ్రమ క్షేత్రపాలకుడై శ్రీబాబూజీ ఆజ్ఞమేరకు ఎందరో భక్తులకు దర్శనమిచ్చినా, ఎవరికీ ఏ హానీ కలిగించకుండా, ఆ స్వామి తమదారిని వెళ్ళిపోతుంది. అందరి మనోభీష్టాలను నెరవేరుస్తున్న పార్వతీదేవి గారాల తనయుడు, ఆరు తలలతో ఉద్భవించిన షణ్ముఖుడు షష్టినాడు భక్తుల పూజలను అందుకుని ఆయన చల్లని దీవెనలతో మనందరినీ అనుగ్రహించు గాక!!


"భగవంతుడు సర్వ శక్తిమంతుడు.
ఆ ప్రభువు దివ్య చరణాల యందు మనస్సు నిలిపితే
సర్వపాతకాలు హరిస్తాయి. జన్మజన్మాంతర వాసనలు
వదిలి మనస్సు శుద్ధి అవుతుంది"

**'సమర్థ సద్గురు'కి**

అభినందనలతో.........

వి. బాబు & సునీత
వి. కాళీ కిర్మణయి
వి. వెంకటరత్న రమాప్రభ




# కుల మతాలకు పరమాత్మ అతీతుడు

- జి.వి

(1982 ఫిబ్రవరి 2న ఒక సత్సంగ సమావేశంలో శ్రీబాబు దివ్యబోధ)

"దేశం, జాతి, కులం, మతం వంటి విభేదాలు మానవ కల్పితాలు. పరమాత్మ వీటన్నిటికి అతీతుడు. ఆయనను శరణుజొచ్చినవారిలో అలాంటి దోషాలను, సంకుచిత భావాలను హరింపజేసి, వారికి విశాల దృష్టి, విశాల హృదయం, విశాల దృక్పథాన్ని ప్రసాదిస్తాడు. సుఖ శాంతులను వివిధ వర్గాల ప్రజల మధ్య సామరస్య సౌమనస్యాలకు ఈ లక్షణాలు పునాదిగా ఉపకరిస్తాయి.

అక్బర్ పాదుషా చాలా అదృష్టవంతుడు. గొప్ప సంస్కారి. జన్మాంతరంలో యోగభ్రష్టుడు. భక్తమీరా, తులసీదాస్ వంటి భక్తాగ్రేసరులకు సమకాలీకుడు. అందువల్లనే ఆయన కీర్తిచంద్రికలు దిగంతాలకు వ్యాపించాయి. మోహన్‌దాస్ అనే వ్యక్తి అక్బర్‌కొలవులో ఒక ఉద్యోగి. అతడు నిజాయితీ పరుడు. ధర్మపరుడు. కృష్ణ భక్తుడు. అక్బర్ అతని గుణసంపదకు మెచ్చి మధుర బృందావన పరగణాలకు సర్వాధికారిగా నియమించాడు. అంతటితో మోహనదాస్ అదృష్టం పండినట్లయింది. ఆ పరగణా అంతా కృష్ణ భక్తులకు నిలయం. ఎక్కడ విన్నా కృష్ణ భగవానుని సంకీర్తనే. కొత్త అధికారి ఆనందానికి అవధులు లేకపోయాయి. ఆ పుణ్యభూమిలో సంచరించటం, కృష్ణ భక్తులతో కలసిమెలసి తిరిగడం తన మహద్భాగ్యంగా భావించాడు. ఆయనలో భక్త్యావేశం పరవళ్ళు తొక్కింది.



మధుర పరగణా నుండి ఏటా 18లక్షల వరహాలు పన్నుల క్రింద ఢిల్లీ పాదుషాకు చెల్లించేవారు. మోహన్‌దాస్ హయాంలో మొదటి సంవత్సరం యథాప్రకారం ప్రజల వద్ద పన్నులు వసూలు చేసి అధికారికి

ఆ ఉద్యోగులు అప్పజెప్పారు.

మోహన్‌దాసు ఆ సొమ్ము మొత్తాన్ని అక్బర్‌కు అప్పజెప్పటానికి బదులు రామదాసు వలె దానిని తన పరగణాలో భగవదారాధన కోసం, సంతర్పణ కోసం పూర్తిగా ఖర్చుపెట్టేశాడు. ఏ మాత్రం సంకోచంగాని, భయంగానీ లేవు అతనిలో.

ఈ సంగతి తెలిసిన అతని బంధువులు, హితైషులు అతని వద్దకు వెళ్ళి బుద్ధిగరపటానికి ప్రయత్నం చేశారు. నిరంతరం కృష్ణ పరమాత్మ యొక్క మధుర నామ స్మరణానందంలో మునిగితేలే మోహన్‌దాస్ "అన్నీ ఆ కృష్ణుడే చూసుకుంటాడులే" అని స్థిమితంగా వారికి జవాబిచ్చాడు. తురుష్క చక్రవర్తి చేతులలో మోహన్‌దాసుకు కలిన శిక్ష తప్పదనే విచారంతో వచ్చినవారు వెనక్కి తిరిగివెళ్ళిపోయారు.

కొద్దిరోజుల్లో అక్బర్ పాదుషాకు కూడా ఈ సంగతి తెలిసింది. మోహ్‌దాస్ సర్కార్ ధనాన్ని దుర్వినియోగం చేసినందుకు మండిపడ్డాడు. రెండు రోజుల్లోగా జమ కట్టవలసిందిగా వ్రాయించి పంపాడు.

రాజభటులు మోహన్‌దాస్ వద్దకు వెళ్ళి దానిని అందజేశారు. నిశ్చలచిత్తుడై అతడు చక్రవర్తి హుకుమ్ చదువుకుని మందహాసం చేశాడు. "పరమేశ్వరుడు సకలలోకాలకు అధినేత. పూచికపుల్ల కూడా ఆయన ప్రసాదించినదే. సర్వసంపదలకు ఆయనే సర్వాధికారి. పన్నుల సొమ్మును నేను నా స్వార్థానికి వినియోగించలేదు. ముల్లోకాలకు అధిపతి అయిన కృష్ణపరమాత్మ సేవలో, ఆయన భక్తుల సేవలో ఆ సొమ్మును వినియోగించాను. ఇది అపరాధమైతే ఆ జగద్రక్షకుడే నన్ను రక్షిస్తాడు" అని సమాధానం వ్రాసి, ఒక పెట్టెలో నిండుగా రాళ్ళు రప్పలు వేసి దానిని రాజభటులకు అందజేశాడు మోహన్‌దాస్.

అతని మూర్ఖత్వానికి రాజభటులు లోలోపల నవ్వుకుంటూ, చేతులారా కొనితెచ్చుకుంటున్నాడు ముప్పు అనుకొని తిరిగి వెళ్ళి పాదుషాకు అతని సమాధాన పత్రాన్ని అందజేసి, పెట్టెను ఆయన ముందు ఉంచారు.

- సశేషం

# సత్సంగామృతం

- మురళీ

సమయం అమూల్యమైనది. మనం ఖర్చుపెట్టిన సమయాన్ని కొద్ది నిమిషాలైనా వెనక్కి తీసుకురాలేము. అన్నిటికంటె గొప్పది కాలం. కాని మనకు ఆశ్రయం యిచ్చిన గురుదేవుల పరమ అనుగ్రహంతో మనకు తెలిసినా తెలియకపోయినా ఈ కాలం మనకు నిత్యకాలంలో జమ అయిపోతుంది. ఇది గురుదేవులు అన్నమాట.

లోక కళ్యాణ కారకుడైన గురుదేవుని అనుగ్రహంతో గురుదేవుని సన్నిధానంలో మనందరం కూడా సృష్టిలోపడినప్పటికీ గురుదృష్టిలో ఉన్నాము. విషయాదుల ముసుగు వేసుకుంటే గురుదృష్టిని మనం చూడలేము. మనందరం కలిసి గురుదేవుల గురించి మాట్లాడు కోవాలి, ఆయన గురించే మాట్లాడుకోవాలి. కదలకుండా చేసే సేవ 'ధ్యానం'. అంటే కళ్ళు మూసుకుని కూర్చోవటం. కళ్ళు తెరిచి చేసే ధ్యానం సత్సంగం, విచారణ. అటువంటి అవకాశాన్ని గురుదేవులు మనకిచ్చారు.



ఆధ్యాత్మిక బంధువులందరం ఆత్మ బంధువులం కాబట్టి మనందరం కలిసి కూర్చుని సత్సంగం చేసుకుంటున్నాము. శ్రీబాబు అమెరికాలో కూడా చెబుతూ ఉండేవారు, ఇంట్లో వాళ్ళందరూ కలిసి కూర్చుని ఒక్కపూటైనా భగవంతుని స్మరించండి. అటువంటి కుటుంబానికి అశాంతి ఎక్కడ ఉంటుంది? శాంతి అనేది నీ దృష్టిని బట్టి, నీ భావనని బట్టి ఉంటుంది. పూర్వజన్మ వాసనతో వచ్చిన సాంగత్య దోషంతో సద్భావన బదులు దుర్భావన పెంచుకుంటున్నాము. దాని వలన అశాంతి పెరుగుతోంది. సర్వమూ వదిలిపెడితే గాని నిద్ర నీ స్వంతం కావటం లేదు. నిద్ర పోయే సమయంలో ఏ ఒక్కదాన్నైనా 'నాది' అని పట్టుకున్నావా? మనల్ని నుంచో బెట్టి ఎన్ని గంటలైనా చేయించగలిగేది గురుశక్తి. సత్కర్మాచరణలో ఒక తృప్తి ఉంటుంది. ఆనందం ఉంటుంది. నాదైన దేవుడికి హాయిగా ఒక్కొక్క పుష్పం తీరుబడిగా పూజ చేస్తుంటే, పూజ చేసుకునేవాళ్ళకి, చేయించేవాళ్ళకి కూడా ఎంతో తృప్తిగా ఉంటుంది. అదీ శ్రీ

గురుఆరాధనలోనే లభిస్తుంది. ఎందుకంటే ఎక్కడకి వెళ్ళినా గురునామం వినిపిస్తూ ఉంటుంది. మననం కూడా జరుగుతుంది. మనస్సుని అంతర్ముఖం చేసుకుంటే, ఆ అనుభూతి ఎంత దివ్యంగా ఉంటుందో మీకే అర్థం అవుతుంది. అదే నిజమైన పూజ.

నామాలు చదివేవాళ్ళకి, పూజకు అందించేవాళ్ళకు, చూసేవాళ్ళకు అందరికీ అద్వితీయమైన ఆనందం లభిస్తుంది. అప్పుడు అందరం ఏక భావనలో ఉంటాము. ఇతరత్రమైన భావనలు ఉండవు. అదే నిజమైన పూజ. అటువంటి పూజ సత్ఫలితాన్నిస్తుంది. మన గురుదేవులు మన తల్లి, తండ్రి, గురువు, దైవము, ప్రభువు. అందరూ వచ్చి కలిసి చేసుకునే ప్రభువు సేవే ఆరాధన. ఆరాధన అంటేనే సమిష్టిలో వ్యష్టి. సమిష్టిలో వ్యష్టి ఎవరు? సత్యవస్తువు ఒక్కటే. అన్నిటిలో ఉన్నది ఒక్కటే కాబట్టి. ఆ ఒక్కటే అన్ని స్వరూపాలు ఎలా అవుతోంది? అది తప్ప ఇంకొకటి లేదు కాబట్టి.

- సశేషం



గురువు త్రిమూర్త్యాత్మక స్వరూపుడు



బ్రహ్మా



విష్ణువు



మహేశ్వరుడు

(గత సంచిక తరువాయి) **హనుమద్వైభవము** - సుషుమ్నా ప్రసాద

అమోఘమైన ప్రతిభాపాటలవము, బుద్ధికుశలత, అఖండ తేజస్సు బలపరాక్రమములున్నా హనుమంతునిలో గర్వలేశము యిసుమంతైనా లేదు. ఆయన నిగర్వి. నయముతో పాటు వినయము కలవాడు. సంపాతి వలన సీతామాత లంకలో ఉన్నట్లు తెలుసుకొని, అంగదాదులు శతయోజనాధికమైన సాగరాన్ని దాటగల సమర్థులెవరా అని ఆలోచించటం ప్రారంభించారు. ఆంజనేయస్వామి మాత్రం తమకేమీ పట్టనట్లు ఒక మూల కూర్చున్నాడు. అక్కడ ఉన్నవారిలో శతయోజనాధికమైన సాగరాన్ని దాటి, తిరిగి రాగల సమర్థులెవరూ గోచరించలేదు. అప్పుడు జాంబవంతుడు, వయస్సులో ఉన్నప్పుడైతే తానాకార్యమును సాధించగలిగి ఉండేవాడిని యిప్పుడు వృద్ధాప్యంలో ఆ పనికి ఉపక్రమించటం దుస్సాహసమని భావించాడు.



అందుకే సర్వసమర్థుడైన హనుమంతుని ఉద్దేశించి "హనుమా! శతయోజన విస్తీర్ణమైన సాగరమును దాటగల సమర్థులలో సర్వోత్తమడవు నీవే! లే! లేచి స్వామికార్యమునకు ఉద్యమించు" అని ఉత్సాహపరచాడు. తన సామర్థ్యమును వేరొకరు గుర్తుచేయాలి కాబట్టి, గుర్తు చేసిన వెంటనే యినుమడించిన ఉత్సాహముతో కార్యోన్ముఖుడయ్యాడు. వెంటనే తన ప్రతిభను గుర్తించి ఇలా ప్రసంగించాడు. "మేఘాలు మర్దిస్తాను. కొండలను కంపింపజేస్తాను. సముద్రాన్ని అల్లకల్లోలం చేస్తాను. లంకానగరాన్ని పెకలించుకురమ్మంటే పెకలిస్తాను."

ఈ సందర్భంలో మారుతి మాటలు స్వాతిశయమునకు నిదర్శనం కాదు. వీరునికి ఉండవలసిన లక్షణము. పరిపూర్ణమైన ఆత్మ విశ్వాసము. పవనసుతుడు పలికిన పలుకు అట్టి ఆత్మవిశ్వాసమునకు ప్రతీకలు. ఈ వాక్యాలు పైకి గర్వానికి సూచనలుగా కనిపించవచ్చు కాని అవి హనుమ యొక్క అకుంఠిత ఆత్మ విశ్వాసమునకు ప్రత్యక్ష ప్రతీకలు.

ఇక సుందరాకాండకు హనుమంతుడే నాయకుడు.

వాయుసుతుని అద్భుతమైన కార్యదీక్ష, అనిర్వచనీయమైన స్వామిభక్తి అద్భుతమైన మేధా సంపత్తి, బుద్ధికుశలత, సమయస్ఫూర్తి, నిరుపమానమైన బలపరాక్రమము, ఇంద్రియ నిగ్రహము, శత్రుసంహార సాహసము, మాతృభక్తి, దౌత్య నిపుణత్వములతో సుందరాకాండలో ప్రస్ఫుటంగా ప్రకాశించాడు. అందుచేతనే ఆత్మసౌందర్యంతో విరాజిల్లే అంజనేయ స్వామి సుందర పురుషుడు.

త్రిభువనైక సుందరి జగన్మాత సీతామాత బాహ్య సౌందర్యము, గుణసౌందర్యము, ఆత్మసౌందర్యానికి పుట్టినిల్లు. ముల్లోకములలో ముగ్ధసౌందర్యమొకచోట రాశీభూతమై సీతమ్మ రూపం దాల్చింది. అలాంటి దివ్యపారమార్థిక సౌందర్యాన్ని హనుమ దర్శించింది కూడా సుందరాకాండలోనే. అమ్మ మహిమాన్వితమైన, పాతివ్రత్య సౌందర్యం కూడా ప్రస్ఫుటంగా ప్రకాశిస్తుంది. సుందరాకాండలో ప్రతిదీ సుందరమే!

- సశేషం



# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

దారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి మీద ఇందిర వెడుతున్న రిక్షాను ఒక లారీ రాచుకుంటూ పోవటంతో రిక్షా, ఇందిరా కూడా మూడు పల్టీలు కొట్టారు. ఇందిరకు బాగా దెబ్బలు తగిలాయి. "చెప్పగానే వినకుండా ఇదంతా కొనితెచ్చుకున్నావు" అని బాధపడుతూ శ్రీబాబు తామే సపర్యలు చేసి ఉపశాంతిని కలిగించారు.



"గురుదేవులు ఒక మాట చెబితే, ఎందుకు చెప్పారో తెలుసుకోవటం అనవసరం. వెంటనే అది ఆచరించటమే శిష్యుని కర్తవ్యం. కానీ అలా చేయకుండా తిప్పలు కొని తెచ్చుకుంటారు. అన్నీ తెలిసిన తిప్పలు నావి, తెలియని తిప్పలు మీవి" అనేవారు శ్రీబాబు.

1968లో ఇందిర కడుపునొప్పితో చాలా బాధ పడింది. డాక్టర్స్ ఎపెండిసైటిస్ ఆపరేషన్ చేయాలన్నారు. శ్రీబాబు ఇందిరను హాస్పిటల్‌లో చేరమన్నారు. ఇందిర 'మీ దర్శనం నాకు అక్కడ దొరకదు. నేను వెళ్లన'ని మొండికేసింది. "ప్రతిరోజూ తప్పక వచ్చి చూస్తాన"ని శ్రీబాబు మాట ఇచ్చి ఇందిరను ఆసుపత్రిలో చేర్పించి, "ఇక్కడ ఉన్నన్నాళ్ళూ ఇతర చింతనలు మాని, నీ లక్ష్యార్థాన్నే స్మరించుకో" అని చెప్పారు. ఇందిర అలానే చేసింది. ఆపరేషన్ బాగానే జరిగింది.

ఆపరేషన్ సమయంలో శ్రీబాబే వచ్చి ఆపరేషన్ చేసినట్లుగా ఇందిర అనుభూతిని పొందింది. తరువాత శ్రీబాబు వచ్చి ఆనంద పడుతూ "నేను చెప్పినట్లుగానే నువ్వు నిరంతరాయంగా ధ్యానం చేసుకున్నావు. ఇక నీకు ఎప్పటికీ ఢోకా లేదు" అప్పుడే శ్రీబాబు తుని జయంతులకు వెళ్ళవలసి ఉన్నది. "జయంతులు అయిపోయిన వెంటనే వచ్చి దర్శనమిస్తాను" అని చెప్పి శ్రీబాబు తుని వెళ్ళిపోయారు.

శ్రీబాబు తుని వెళ్ళిన రెండో రోజున ఇందిరకు చాలా ప్రమాదం చేసింది. డాక్టర్లు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. కాని గుణం కనబడలేదు. ఇందిరకు తనకు అవసాన దశ సమీపించినట్లుగా పూర్వ అనుభవాన్ని బట్టి అనిపించింది. అక్కడే ఉన్న శకుంతలమ్మగారితో (ఇందిర రెండవ అక్క) కలము, కాగితము తెమ్మనమని **I AM PASSING**

**AWAY** (నేను చనిపోతున్నాను) అని ఆ కాగితం మీద వ్రాసి ఇచ్చింది. అందరూ ఆందోళన పడుతున్నారు. ఇందిర మనస్సులో భయానికి బదులుగా 'శ్రీబాబు నాకు తుని నుండి రాగానే దర్శనం ఇస్తాను అన్నారు కదా! ఆయన వాక్కు ఎలా వ్యర్థమవుతుంది?' అనే విచారణ కొనసాగింది. ఆ విధంగా ఇందిర ఆ సమయంలో శ్రీబాబు చింతనలోనే ఉన్నది. తరువాత నెమ్మదిగా ప్రమాదస్థితి నుండి బయట పడింది. శ్రీబాబు తాము చెప్పినట్లుగానే తుని నుండి సరాసరి గుంటూరు ఆసుపత్రికి వచ్చి ఇందిరకు దర్శనమిచ్చారు.

గురువుగారి ఏకైక పుత్రిక భర్తతో కలిసి హైదరాబాదులో ఉంటున్నది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆమె ఆకస్మికంగా మృతి చెందినది. ఈ విషయం గురువుగారికి తెలిసేముందు ఒక విచిత్ర సంఘటన జరిగింది. ఆ రోజు రాత్రి గురువుగారు శ్రీబాబు వద్ద ఉన్నారు. నేను (రచయిత) నా భార్య కళ్యాణి కూడా అక్కడే ఉన్నాము. ఆ సమయంలో మా పెద్దమ్మాయి అరుంధతికి ప్రమాదంగా ఉన్నదని వెంటనే రమ్మని బళ్ళారి నుండి టెలిగ్రాం వచ్చింది. శ్రీబాబు మాతో ఊరడింపుగా "విచారించకు వెంకటరత్నం! భగవానుడు ఎవరికి ఏ సమయానికి ఏదేది జరగాలని నిర్ణయిస్తాడో అది జరగక తప్పదు. ఒక చెట్టుకు కాసిన కాయలన్నీ పండ్లు అవుతాయా? ఇటువంటి సమయంలోనే స్థైర్యాన్ని కోల్పోక స్థిత ప్రజ్ఞుడై నిలచినవాడే జ్ఞాని" అని అంటూ గురువుగారిని కూడా మాకు ధైర్యం చెప్పమన్నారు.

గురువుగారు మాట్లాడుతూ "ఈ సంసారం, దారా పుత్రాదులు, భోగభాగ్యాలు ప్రసాదించినవాడు భగవంతుడు. ఎప్పుడేది ఇవ్వాలో, ఏది తీసేసుకోవాలో ఆయనకు తెలుసు. ఇదంతా ఆయన స్వంతమైనదిగాని మనది కాదు. తన ప్రతినిధులుగా దీని సంరక్షణ బాధ్యతను నిర్వర్తించటానికి మాత్రమే మనలను నియమించాడని గ్రహించాలి. ఒక బ్యాంకు మేనేజరు చేతిమీదుగా లక్షల రూపాయలు వస్తూ పోతూ ఉంటాయి. అందులో ఒక్క రూపాయి కూడా తనది కాదు. అలాగే బ్యాంకుకు వచ్చే లాభనష్టాలు కూడా తనవి కావు. బ్యాంకువారు ఇచ్చే జీతమే తనది. అలాగే మానవుడు భగవంతుని ప్రతినిధిగానే సంసారం నిర్వహించు కోవాలి. సుఖదుఃఖాలకు బెంబేలు పడకూడదు. తానెవరో తాను తెలుసు కోవటానికి భగవానుడు ప్రసాదించిన ఈ మానవ జన్మమే మనకు ఆయనిచ్చే ప్రతిఫలమని తెలుసుకోవాలి. మీరు ధైర్యంగా ఉండండి. భగవంతుడు ఏది జరిపినా అది మన మంచికే అనే విశ్వాసంతో వెళ్ళిరండి" అని చెప్పారు.

- సశేషం

## విష్ణు కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

కబీర్‌దాస్ మన దేశంలో ఉద్భవించిన జ్ఞానులలో గొప్పజ్ఞానిగా ఆధ్యాత్మికవేత్తగా, కవిగా పరిగణించబడతాడు. 'భగవంతుని దృష్టిలో అందరూ సమానులే, భగవంతుని పొందే హక్కు అందరికీ సమానమే' అన్న దృక్పథం కలవాడు. భగవంతుని ఎడల ఆయనకు గల ప్రేమ, భక్తి ఆయన కవితలలో మనకు కనిపిస్తాయి. సిక్కుల మత గ్రంథం అయిన గురుగ్రంథ్ సాహిబ్‌లో ఈ మహనీయుడు వ్రాసిన దోహాలు 500 పైగా తీసుకొనబడ్డాయి. కబీర్‌దాస్ 1398 లో జన్మించినట్లు చెబుతారు.



శ్రీమహావిష్ణువును లక్ష్మీదేవి ఈ విధంగా అడిగింది. "స్వామీ! ఎచట చూసినా ధన మోహితులైన నా భక్తులు ఉన్నారు. మోక్షాపేక్ష గల మీ భక్తులు అసలు ఉన్నారా?" అని. "దేవీ! నా భక్తులు లేని కాలమంటూ లేదు. కాకులు అన్ని చోట్లా ఉంటాయి కాని హంసలు అరుదుగా కనిపిస్తాయి. నీ భక్తులు అన్ని చోట్లా ఉన్నారు. నా భక్తులు కొన్ని చోట్లనే ఉన్నారు. వారు లోకాన్ని ఉద్ధరించటానికి ఉద్భవించారు" అన్నాడు విష్ణుమూర్తి. "స్వామీ! మీరు సత్య స్వరూపులే అయినా మీ మాటలు విశ్వసనీయంగా లేవు. అలాంటి భక్తులలో పరమ పవిత్రుడైన భక్తుడిని ఒక్కడిని నాకు చూపండి" అంది.

"దేవీ! కాశీ క్షేత్రంలో రామానంద స్వామి అనే సాధువు ఉన్నాడు. అతడు త్రికరణ శుద్ధిగా నన్ను సేవించి తరించిన ముక్త పురుషుడు" అని విష్ణుమూర్తి తెలియచేసాడు.

లక్ష్మీదేవి రామానందుని పరీక్ష చేయాలని భావించి, రామానందుడు గంగానదికి స్నానానికి వెళ్ళేదారిలో ఒక చక్కని గులాబీతోట సృష్టించింది. రామానందుడు ఒక్క పుష్పాన్ని తీసుకొనబోతే లక్ష్మీదేవి మారు వేషంలో ప్రత్యక్షమై "నా అనుమతి లేకుండా నీవు ఈ పుష్పాన్ని తీసుకున్నావు" అన్నది. "తల్లీ! క్షమించు. అందమైన పూవు

భగవంతుని చరణాలపై ఉంచాలని అనిపించి కోశాను" అని ఆ పుష్పాన్ని అక్కడే వదలి రామానందుడు వెళ్లిపోయాడు.

లక్ష్మీదేవి ఆ పుష్పాన్ని విష్ణుమూర్తికి చూపిస్తూ "మీరు చెప్పిన రామానందుడు భక్తుడు కాదు అతడు ఈ పువ్వు దొంగిలించాడు" అన్నది. "దేవీ! నువ్వు పొరపాటు పడ్డావు. ఇది అతని అపారభక్తికి తార్కాణం. అతడు నా విగ్రహం ముందు ఈ పుష్పాన్ని పెట్టాలని భావించాడు. అతడు భక్తితో కోయడం చేత నీవు ఆ పుష్పాన్ని తెచ్చి నాకు సమర్పించావు" అని మందహాసం చేశాడు. లక్ష్మీదేవి ముఖం చిన్నబోయింది. "స్వామీ అతని అభీష్టాన్ని తీరుస్తాను" అంది. విష్ణుమూర్తి, "దేవీ! రామానందుడు వాంఛాతీతుడు. భక్తిని ప్రజలలో వ్యాపింపచేయటమే అతని ప్రధాన కర్తవ్యము. అతని భక్తి ఉద్యమానికి ఉపకరించే ఉత్తమ భక్తుని శిష్యునిగా పంపడమే మనం అతనికి చేయగలిగిన సహాయం. "ఇదిగో రామానందుడు నాకు సమర్పించబోయిన ఈ పుష్పానికి జీవం పోసి రామానందుని ముఖ్య శిష్యులలో ప్రధముడుగ ఉండేటట్లు అనుగ్రహిస్తాను" అని ఆ పుష్పాన్ని గంగలో వదిలాడు.

ఆ పుష్పం గంగానదిలో తేలియాడుతూ వచ్చి పద్మపత్రంపైన పడింది. ఆ పుష్పం అందమైన బాలుడుగా మారి తేలి వస్తోంది. నీరూ అనే నేత పని చేసే మహమ్మదీయుడు ఆ బాలుని తీసుకొనివచ్చి "కబీర్" అని పేరు పెట్టి పెంచుతున్నాడు.

మాటలు వస్తూనే ఆ బాలుడు రామోచ్చారణ మొదలు పెట్టాడు. అందరూ ఆ తురుష్కునికి భగవద్దాసు జన్మించాడు అని కొనియాడారు. జ్ఞాన సముపార్జనకు గురువుల దగ్గరకు పంపినా పెద్దగా విద్యార్జన చేయలేకపోయాడు కబీరు. అయినా విద్యావంతుడయ్యాడు. కవి అయి గేయాలు వ్రాశాడు. భక్తుడై కీర్తనలు రచించాడు. గాయకుడై ఉత్సాహంగా గానం చేసాడు.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL